అన్నదాతలపై కేంద్రం బహుముఖ దాడి

- తెలంగాణాలోని కడవెండిలో ప్రారంభమైన రైతు అమరవీరుల జ్యోతి యాత్ర

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuram

సంపుటి : 42 సంచిక :125 | విజయవాడ, మంగళవారం 6 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tueseday 6 December 2022 | Rs

డెంటల్ విద్యార్థిని దారుణ హత్య

- ఐటి ఉద్యోగి కిరాతకం



తపస్వినిని హత్య చేసిన జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి : డెంటల్ విద్యార్థినిని ప్రేమోన్మాదిగా మారిన ఐటి ఉద్యోగి దారుణంగా హత్య చేశాడు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్ మణికొండ ప్రాంతంలో ఐటి రంగంలో పనిచేస్తోన్న జ్ఞానేశ్వర్ విజయవాడలోని గన్నవరం పిన్నమనేని డెంటల్ కళాశాలలో చదువుతున్న తపస్వినిని ప్రేమిస్తున్నానంటూ వేధించేవాడు. ఆమె విజయవాడ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడులోని తన స్నేహితురాలి గదికి ఆమె సోమవారం వెళ్లినట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి సర్జికల్ బ్లేడ్‌తో దాడి చేశారు. స్థానికులు వచ్చి జ్ఞానేశ్వర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆస్పత్రికి తరలించేలోపే మార్గమధ్యంలో తపస్విని మృతి చెందింది.



క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ అధికారులతో సిఎం జగన్మోహన్‌రెడ్డి సమీక్ష

'జి-20'కి సహకరించండి

అఖిలపక్ష సమావేశంలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జి-20 అధ్యక్ష బాధ్యతలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అఖిలపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. భారతదేశానికి ఈ ఏడాది జి-20 అధ్యక్షత దక్కడం, ఇటీవలే ప్రధాని ఆ బాధ్యతలను స్వీకరించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించింది. రాష్ట్రపతి భవన్‌లోని అశోకా హాల్‌లో ప్రధాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేశంలో దాదాపు 50 నగరాల్లో 200కు పైగా నిర్వహించనున్న కార్యక్రమాల ప్రణాళికను వివరించారు. రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో వివిధ పార్టీలు పలు సూచనలు చేశాయి. తొలుత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఏడాది పాటు నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించి ప్రజెంటేషన్ ఇచ్చింది. అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ జి20 ప్రెసిడెన్సీలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'ఇది దేశానికి లభించిన గౌరవం. ఒక పార్టీ లేదా వ్యక్తికి కాదు. ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణం. దీనిని విజయవంతం చేయడానికి మనమందరం సహకారంతో పని చేద్దాం' అని ఆయన అన్నారు.

దేశ ప్రయోజనాలకు వినియోగించాలి : ఖర్గే

ప్రతిష్టాత్మకమైన జి-20 అధ్యక్ష పదవిని దేశ ప్రయోజనాలకోసం వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ సాధనతో పాటు, ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఉగ్రవాదానికి కొన్ని దేశాలు ఇస్తున్న మద్దతును ఈ సమావేశాల్లో లేవనెత్తాలన్నారు. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడి ఇతర దేశాలకు పారిపోయిన వారిని స్వదేశం రప్పించేందుకు అవసరమైన వ్యవస్థను తయారుచేసుకోవడానికి కూడా ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలన్నారు.



ప్రధాని అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం, పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

ఏ బాధ్యత అప్పగించినా నెరవేర్చుతాం : వైఎస్ జగన్మోహన్ రెడ్డి

జి-20 శిఖరాగ్ర సమావేశానికి సంబంధించి తమకు ఏ బాధ్యత అప్పగించినా నెరవేర్చుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. . ఈ ప్రతిష్టాత్మక సదస్సు విజయవంతం కావడానికి అన్నిరకాలు తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జి-20 అధ్యక్ష పదవిని భారత్ చేపట్టిన నేపథ్యంలో రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పారు. అంతర్జాతీయ సమాజం దేశం వైపు చూస్తున్న ఈ సందర్భంలో అందరూ ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సహజమని, కాని వాటినిపరిమితం చేసుకుని జి-20 సదస్సు విజయవంతం చేయడానికి కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు.

25 ఏళ్ల విజన్ డాక్యుమెంట్ కావాలి : చంద్రబాబు

జి-20 సదస్సు సందర్భంగా దేశ భవిష్యత్ ప్రయాణంపై వచ్చే 25 ఏళ్ల విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకోవాలని టిడిపి అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే 25 ఏళ్లలో ప్రపంచంలో ఇండియా నంబర్ వన్ దేశంగా అవతరిస్తుందని చెప్పారు. యువ శక్తి మన దేశానికి ఉన్న బలమని, వారికి అవకాశాలు సృష్టించేలా ప్రభుత్వాలు పాలసీల రూపకల్పన జరగాలని అన్నారు. దేశానికి ఉన్న మానవ వనరుల శక్తిని, నాలెడ్జ్ ఎకానమీ అనుసంధానించడంతో అత్యుత్తమ ఫలితాలు వస్తాయని తెలిపారు.

పూర్తి సహకారం : ఎంకె స్టాలిన్

డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ మాట్లాడుతూ దేశం దశాబ్దాలుగా ఒక ప్రత్యేకమైన అలీన విధానాన్ని విదేశాంగ విధానంగా కలిగి ఉందని చెప్పారు. ఆ విధానమే ఇప్పటికీ స్థిరంగా కొనసాగుతోందన్నారు. జి20 ప్రెసిడెన్సీ కి ప్రపంచ దక్షిణాదికి వాయిస్‌గా నిలబడటం తమ వంతు బాధ్యతని చెప్పారు. అంతర్జాతీయ అవగాహనను పెంపొందించడానికి ప్రధాని మోడీ ఈ అవకాశాన్ని

మిగతా 5లో

స్వేచ్ఛ, సమానత్వం ప్రాతిపదికగా వైవిధ్యతను ఆమోదించాలి

- అదే వసుధైక కుటుంబం భావన
- అఖిల పక్ష సమావేశంలో ఏచూరి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం లక్షణాన్ని నిర్వచించే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ పునాదులను ఖచ్చితంగా పాటించడంతోనే ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం సాక్షాత్కారం అవుతుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో ప్రస్తుత ఆందోళనకరమైన పోకడలను సరిదిద్దాలని నొక్కి చెప్పారు. భారతదేశం స్వీకరించిన జి-20 అధ్యక్షత బాధ్యతలను, ప్రకటించిన లక్ష్యాలను ప్రపంచం గుర్తించాలంటే ప్రభుత్వం లక్ష్య సాధన దిశగా పని చేయాలని సూచించారు. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన అఖిలపక్షం సమావేశంలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ జి-20 అధ్యక్ష బాధ్యత ప్రతిదేశానికి రొటేషన్ పద్ధతిలో వస్తుందని తెలిపారు. దక్షిణాసియా ఆర్థిక సంక్షోభం తరువాత 1999లో జి-20 ఏర్పాడిందని, నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల వల్ల నెలకొన్న

మిగతా 5లో

సమస్యలు పరిష్కరించండి

- ధాన్యం సేకరణపై సిఎం జగన్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిల్లర్ల ప్రమేయం లేకుండా తొలిసారి ధాన్యం సేకరిస్తున్న నేపథ్యంలో ఎదురయ్యే సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ, కొనుగోళ్లపై వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ అధికారులతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర కన్నా ఒకపైసా తగ్గకుండా రేటు రావాలన్న ఉద్దేశ్యంతో కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ధాన్యం సేకరణపై ముందస్తు అంచనాలు వేసుకుని, ఆ మేరకు గోనెసంచులు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రవాణా, లేబర్‌ఖర్చుల రీ-ఎంబర్స్‌మెంట్‌లో జవాబుదారీతనం ఉండాలన్నారు. రవాణాఖర్చులు, గన్నీబ్యాగుల ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తోందన్న విషయం రైతులకు తెలియాలని దీనికోసం ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో కార్పొరేషన్ నుంచి వారికి నగదు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం సేకరణ కోసం తయారు చేసిన యాప్‌లో సిగ్నల్స్ సమస్యల వల్ల అక్కడక్కడా ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఏర్పడిన సందర్భాల్లో ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి సిగ్నల్ ఉన్న ప్రదేశాల్లోకి వెళ్లగానే ఆ వివరాలన్నీ ఆటోమేటిక్‌గా ఆన్‌లైన్‌లోకి లోడ్ అయ్యేలాగా మార్పులు చేసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, కొనుగోళ్లపై సమాచారాన్ని సమగ్రంగా తెలియజేసేలా ఆర్‌బికెల్లో పోస్టర్లు అంటించాలని, దీనివల్ల రైతుల్లో అవగాహన కలుగుతుందన్నారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ల విధులకు సంబంధించి నిబంధనావళిని రూపొందించి, దానిని పాటించేలా సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల సాగుమీద రైతులకు అవగాహన కలిగించాలని చెప్పారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎపి అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, సిఎస్ కెఎస్.జవహర్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి వి.వి.సత్యనారాయణ, రవాణాశాఖ కార్యదర్శి ఎస్.ప్రద్యుమ్న, పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్, వ్యవసాయశాఖ కమిషనరు సి.హరికిరణ్, మార్కెటింగ్‌శాఖ కమిషనరు రాహుల్ పాండే, పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ విజయ సునీత పాల్గొన్నారు.

డిఎస్ఎంఎం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షునిగా కె. రాధాకృష్ణన్
- ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర డోమ్



కె. రాధాకృష్ణన్



రామచంద్ర డోమ్

పాట్నా : దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) అధ్యక్షునిగా కె. రాధాకృష్ణన్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రామచంద్ర డోమ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 69 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. వీరిలో 18 మందిని ఆఫీస్ బేరర్స్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీహార్లోని బెగుసరాయ్‌లో జరుగుతున్న మూడవ అఖిల భారత మహాసభ చివరిరోజైన సోమవారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

రాష్ట్రం నుండి ముగ్గురు


డిఎస్ఎంఎం జాతీయ కమిటీలో రాష్ట్రం నుండి ముగ్గురికి అవకాశం లభించింది. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రిని డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శిగా, ఓ. నల్లప్ప, బి. లక్ష్మిలను జాతీయ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మనువాద, మతోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని రకాల శక్తులను కలుపుకుని ఐక్యపోరాటాలను చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడ పోరాటాలు చేయాలని నిర్ణయించింది.

'అవుట్ సోర్సింగ్' గందరగోళం

- పొంతన లేని ప్రభుత్వ ప్రకటనలు
- కమ్యూనికేషన్ గ్యాప్ వల్లే : సజ్జల
- కొందరికి వర్తిస్తాయి : బొత్స
- నేడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు దుమారం కొనసాగుతోంది. పది సంవత్సరాలు నిండని అవుట్ సోర్సింగ్ సిబ్బందిని సర్వీసు నుండి తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు 4వ తేది ప్రజాశక్తి మొదటి పేజీలో పతాక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. 'అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు మొదలైంది' అనే శీర్షికతో ప్రచురితమైన ఈ కథనం ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ నిర్ణయంపై పలు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మరోవైపు సోమవారం నాడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడపై సర్కారు కత్తి పెట్టిన తీరును వివిధ పత్రికలు ప్రచురించడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. విలేకరులతో మాట్లాడిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి 'కమ్యూనికేషన్ గ్యాప్' వల్ల ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని అన్నారు. ఈ మేరకు జారీ అయిన మెమోపై



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు మొదలైంది

- పదేళ్ల లోపు సర్వీసు ఉంటే ఇంటికే
- ప్రభుత్వ రహస్య ఆదేశాలు
- ఆందోళనలో 2.40 లక్షల మంది

// CONFIDENTIAL //

DIRECTORATE OF WORKS ACCOUNTS
AP, IBRAHIMPATNAM, VIJAYAWADA

Memo No.DWA/AP/IBM/Sn.II/A.1/2022-23/ 232 Dated: .12.2022

Sub:- Outsourcing personnel – Outsourcing personnel working in Works Accounts Department - Discontinuation of the services immediately – Instructions issued – Reg.

Ref:- e-office Computer No.1845498 dt.28.11.2022.

It is informed that Government through reference cited have issued instructions to discontinue the services of outsourcing personnel ie., DEOs/Typist/Junior Assistant working in Works Accounts Department of all those who have less than 10 years of service with immediate effect.

All the JDWAs/PAOs/APAOs are directed to discontinue the services of the outsourcing personnel ie., DEOs / Typists / working in their offices who have rendered less than 10 years of services (list enclosed) immediately and report compliance.

Director of Works Accounts
AP, Ibrahimpatnam, Vijayawada

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని చెప్పారు. అదే సమయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ 'కొన్ని శాఖల్లో కొంతమందికి' ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వర్తిస్తాయని ఆయన చెప్పారు. 'ఏ శాఖల్లో .. ఎంత మందికి' అన్న విషయమై ఆయన స్పష్టత ఇవ్వలేదు. విలేకరులు ఇదే విషయాన్ని ప్రశ్నించడంతో 'నిబంధనలకు విరుద్ధంగా కొన్ని నియమాకాలు జరిగాయి'. అని ఆయన అన్నారు. ప్రభుత్వం నుండి వెలువడిన ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో 'తొలగింపు' ఆదేశాలు అమలు జరుగుతూనే ఉన్నట్లు సమాచారం. ఆడిట్ విభాగంలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని సిఎం ఆదేశించారని సజ్జల చెప్పినా ఆ శాఖలో సిబ్బందికి వ్యక్తిగతంగా కూడా తొలగింపు ఉత్తర్వులు అందినట్లు సమాచారం. పంచాయతీరాజ్ శాఖతో పాటు, సాంఘిక సంక్షేమశాఖలోనూ తొలగింపు ఆదేశాలు జారీ అయినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు నేడు (మంగళవారం) జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు సంబంధించి ప్రభుత్వం వివరణ ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

దేవాలయాల నిర్మాణ బాధ్యత ఆర్ఎస్ఎస్ సంస్థలకా?

- సిపిఎం అభ్యంతరం
- ముఖ్యమంత్రికి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 1,400 దళితవాడల్లో దేవాలయాల నిర్మాణ బాధ్యతలు ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన సమరసత సంస్థకు కేటాయించడం పట్ల సిపిఎం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. 'ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభ్యంతరకరం. ఆక్షేపణీయం.' అని ఈ లేఖలో ఆయన పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కూడా అయిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మంత్రి కొట్టు సత్యనారాయణ దేవాలయాల నిర్మాణంపై చేసిన ప్రకటనను ఈ లేఖలో ఆయన ప్రస్తావించారు. 340 దేవాలయాల నిర్మాణ బాధ్యతలను ఆర్ఎస్ఎస్ ప్రోత్సాహంతో నడుస్తున్న సమరసత ఫౌండేషన్‌కు అప్పగిస్తున్నట్లు ప్రకటించిన మంత్రి ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షలు కేటాయించారని వివరించారు. సమరసత తరహా సంస్థ ఘర్‌వాపసి పేరుతో దళితవాడల్లో, కాలనీల్లో వివిధ మతాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. మత సమరస్యానికి విఘాతం కలిగిస్తోందని, రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాలు మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ బిజెపికి ఉపకరించే రీతిలో పనిచేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సమరసతా ఫౌండేషన్ లాంటి సంస్థలకు ప్రభుత్వ నిధులను కేటాయించి, దేవాలయాల నిర్మాణ బాధ్యతలు అప్పగించటం సరికాదని తెలిపారు. ధార్మిక సంస్థయిన టిటిడితో వారికి లంకె పెట్టడం ప్రమాదకరమని తెలిపారు. మత ఉద్రిక్తతలు రెచ్చగొడుతూ, లౌకికస్ఫూర్తికి భిన్నంగా పనిచేస్తున్న సంస్థలకు ప్రభుత్వం తోడ్పాటు అందించడం, ప్రభుత్వ నిధులను కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఒకవైపున సామాజిక న్యాయానికి, రాజ్యాంగ విలువలకు, లౌకికవాదానికి కట్టుబడి ఉంటామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు ఈ విలువలను కాలరాస్తున్న ఆర్ఎస్ఎస్ దాని ప్రోత్సాహ సంస్థలకు ప్రభుత్వ నిధులు కేటాయించడం, దేవాలయ నిర్మాణ బాధ్యతలు అప్పగించడం అభ్యంతరకరమని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి సమరసత ఫౌండేషన్‌కు దేవాలయ నిర్మాణ బాధ్యతలను అప్పగించే నిర్ణయాన్ని, ఉత్తర్వులను ఉపసంహరించాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల నమోదులో భారీ అక్రమాలు

- కలెక్టరేట్ ఎదుట సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల ధర్నా
- సీనియర్ ఐఎఎస్ అధికారితో విచారణ చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి- నెల్లూరు

శాసనమండలి ఎన్నికల ఓట్ల నమోదులో అధికార పార్టీ భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడిందని, వీటిపై అధికారులు విచారణ చేపట్టి బోగస్ ఓటర్లను తొలగించాలని కోరుతూ సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాలు ఆధ్వర్యాన నెల్లూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఎన్నికల కమిటీ కన్వీనర్ ఎం.మోహన్‌రావు, సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ప్రసంగించారు. అధికార పార్టీ బలపర్చిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి, కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఓటర్ల నమోదులో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. కృష్ణ చైతన్య విద్యాసంస్థలు, ఎన్.బి.కె.ఆర్ విద్యా సంస్థల లాంటి కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నట్లు పేర్కొంటూ భారీ సంఖ్యలో అక్రమ పద్ధతిలో ఓటర్లుగా చేర్పించారని అన్నారు. కొన్ని దరఖాస్తుల్లో ఓటరు పేరు పురుషుడిగా నమోదు చేసి ఫొటోలు మాత్రం మహిళలవి ముద్రించి ఉన్నాయని తెలిపారు. అనర్హులను, ఎటువంటి సర్వీసూ లేనివారిని కౌంటర్ సంతకాలు లేకుండా ఓట్లగా నమోదు చేయించారని విమర్శించారు. మాంసం కొట్టులో పనిచేస్తున్న వారిని సైతం ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదు చేయించారని తెలిపారు. ఈ అక్రమాలపై సీనియర్ ఐఎఎస్ అధికారితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలల ఉపాధ్యాయుల పేర్లు డైస్, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల బోధనా సిబ్బంది పేర్లు జ్ఞానభూమి, ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకుల పేర్లు ఎఐసిటిఇ పోర్టల్‌లో నమోదై ఉంటాయన్నారు. ప్రస్తుతం ఎంఎల్‌సి ఉపాధ్యాయ అభ్యర్థికి ఓట్లు వేసేందుకు ప్రభుత్వం విడుదల చేసిన ఓటరు జాబితాలోని ఓటర్ల సంఖ్యకు భారీగా తేడా ఉందని తెలిపారు. ఇ-పోర్టర్‌లోలేని అనేకమంది పేర్లు ఓటరు జాబితాలోఉన్నాయన్నారు. ఇటువంటి అనర్హులైన 500 మందిని గుర్తించామని తెలిపారు. ఈ అక్రమాలపై పూర్తి ఆధారాలతో కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల శాసనమండలి ఓట్ల నమోదులో సైతం బోగస్ సర్టిఫికెట్లతో నమోదు చేయించారన్నారు. బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి వెరిఫై చేయకపోవడంతో బోగస్ ఓట్లు అనేకం నమోదయ్యాయని తెలిపారు. ఈ అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వి.రామరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.నరసింహ, ఎం.వెంకటరమణ, మధ్యతరగతి ఉద్యోగ సంఘాల కన్వీనర్ ఆర్.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా లౌకిక దేశం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- అనుకూల్ చంద్రను పరమాత్మగా ప్రకటించాలన్న పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారతదేశం లౌకిక దేశమని సర్వోన్నత న్యాయస్థానం ఉద్ఘాటించింది. సత్సంగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీశ్రీ ఠాకూర్ అనుకూల్ చంద్రను "పరమాత్మ"గా ప్రకటించాలని ఉపేంద్రనాథ్ దలై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిటిషన్)ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. భారతదేశం లౌకిక దేశమని, దేశ పౌరులు అనుకూల్ చంద్రను పరమాత్మ (సుప్రీమ్ స్పిరిట్)గా అంగీకరించాలన్న పిటిషనర్ వాదనను అనుమతించలేమని పేర్కొంది. 'మీ గురూజీని అందరూ అంగీకరించాలని మీరు అంటున్నారు. వారి వారి దేవున్ని ఎన్నుకోవడానికి దేశంలో ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది" అని జస్టిస్ షా స్పష్టం చేశారు. పబ్లిసిటీ ఇంట్రెస్ట్ లిటిగేషన్ కోసం పిటిషన్ దాఖలు చేసినందుకు పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. నాలుగు వారాల్లో సుప్రీం కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది.

తిరుగు పయనంలో విషాదం



బోల్తా పడిన వాహనం

నలుగురు అయ్యప్ప భక్తుల దుర్మరణం

18 మందికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- వేమూరు (బాపట్ల జిల్లా)

రోడ్డు ప్రమాదంలో నలుగురు అయ్యప్పస్వామి భక్తులు దుర్మరణం చెందారు. 18 మందికి గాయాలయ్యాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలంలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది.

ప్రయాణికులు, పోలీసుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా నీలిపూడి గ్రామానికి చెందిన 22 మంది అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లి తిరిగి రైల్లో తెనాలి చేరుకున్నారు. అక్కడి నుంచి టాటా ఏస్ వాహనంలో తమ స్వగ్రామం బయలుదేరారు. మంచు తీవ్రత అధికంగా ఉండడంతో వేమూరు మండలం జంపని శివారు చెరువు వద్ద మలుపు కనిపించకపోవడంతో వారి వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బొలిశెట్టి పాండురంగారావు (40), పాశం రమేష్ (55), బడితి రమేష్ (42) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. 19 మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిని తెనాలి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో బుద్దన పవన్ కుమార్ (25) మరణించారు. వేమూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రకటించారని మంత్రి జోగి రమేష్ తెలిపారు. క్షతగాత్రులను ఆయన పరామర్శించారు.

వ్యకాస రాష్ట్ర మహాసభ నేపథ్యంలో 'సుందరయ్య జ్యోతి'

ప్రజాశక్తి - నెల్లూరు

ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరగనున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29 రాష్ట్ర మహాసభ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం పురుడుపోసుకున్న గ్రామమైన ఆలాగానిపాడులో 'సుందరయ్య జ్యోతి'ని వెలిగించారు. ఎనిమిదిన ఈ జ్యోతి జంగారెడ్డిగూడెనికి చేరుకుంటుంది. మహాసభ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనే జాతీయ నాయకులు బృందా కరత్, అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్, అధ్యక్షులు విజయరాఘవన్ ఈ జ్యోతిని అందుకుంటారు. ఆలాగానిపాడు గ్రామస్తుడు పిచ్చయ్య సోమవారం జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ రాజు మాట్లాడారు. పేదవారి జీవితాల్లో వెలుగు రావాలని, జీవితాలు బాగుపడాలని, పేదలందరికీ భూమి ఇళ్లు కావాలని, అందరికీ విద్యా, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని అనేక పోరాటాలకు పుచ్చలపల్లి సుందరయ్య ఊపిరిగా నిలిచారన్నారు. కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్ట్ హాల్‌టిక్కెట్లను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కమిషన్ కార్యదర్శి ఆరుణ్‌కుమార్ సోమవారం వెల్లడించారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 49,904 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్షను ఎపిపిఎస్‌సి నిర్వహించనుంది. అభ్యర్థుల హాల్ టిక్కెట్లను కమిషన్ వెబ్‌సైట్ psc.ap.gov.inలో పొందుపరిచారు. ఈ నెల 5 నుంచి పరీక్ష చివరి తేదీ 14 వరకు అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా ఈ సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను దగ్గర్లో అవసరం ఉన్న పాఠశాలలకు పంపాలని పేర్కొన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు లేకపోతే ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను దగ్గరలోని మున్సిపల్ పాఠశాలలకు పంపాలని సూచించారు. మంగళవారం లోపు ఈ ప్రక్రియ పూర్తికాకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జనసేన నేతపై దాడికి చంద్రబాబు ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇది నాటి రోజుల్లో బీహార్ కాదని, నేటి రోజుల్లో పుంగనూరని జనసేన నాయకుడిపై జరిగిన దాడిని ఉద్దేశించి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పుంగనూరులో జనసేన నాయకుడిపై జరిగిన దాడిపై సోమవారం తన ట్విట్టర్ ఖాతాలో చంద్రబాబు స్పందించారు. నాలుగు జతల ఖాకీదుస్తులు స్థానిక పోలీస్ అధికారులకు పంపాలని డిజిపిని ఉద్దేశించి పేర్కొన్నారు. లేదంటే రాష్ట్రంలో మొత్తం పోలీస్‌శాఖను మూసేశారు అనుకుంటారని విమర్శించారు.

శరత్ చంద్రారెడ్డికి మరో 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన శరత్‌చంద్రారెడ్డి, బినోయ్‌బాబుల జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు పొడిగించింది. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో సోమవారం వారిద్దరినీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రౌజ్ అవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టులో ఇడి హాజరుపరిచింది. వాదనల అనంతరం బినోయ్, శరత్‌చంద్రా రెడ్డిల జ్యుడీషియల్ రిమాండ్ మరో 14 రోజులు పొడిగిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. శరత్‌చంద్రా రెడ్డి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై ఈ నెల 13న విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అభిషేక్ బోయినపల్లి, విజయ్‌నాయర్‌ల బెయిలు రద్దు చేయాలంటూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. ఇరు పక్షాల న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు విచారణ ఈ నెల 22కు వాయిదా వేసింది.

24 గంటల్లో ఎఫ్ఐఆర్ అప్‌లోడ్ చేయాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

కేసు నమోదు చేసిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ కాపీలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని హోం శాఖను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తీసుకున్న చర్యలు ఏమిటో వివరించాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, సిఐడి, ఉన్నతాధికారులను కోరింది. ఫిర్యాదుదారులు, నిందితులు కోరితే ఎఫ్ఐఆర్ కాపీలను అందజేయాలని జస్టిస్ రావు రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై సిఐడి పెట్టిన పలు కేసుల గురించి కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని మాజీ మంత్రి సిహెచ్ అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఉత్తర్వులను సోమవారం జారీ చేసింది. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కేసు నమోదు చేసిన 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్ కాపీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఆ విధంగా చేయడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది వి.వి.సతీష్ వాదించారు.

ప్రశ్నించండి... సమాధానాలు వెతకండి..!

- మహిళా వర్సిటీ 'ముఖాముఖి'లో రాష్ట్రపతి
- శ్రీవారిని దర్శించుకున్న ద్రౌపది ముర్ము



రాష్ట్రపతికి జ్ఞాపికను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి , కలెక్టర్, వేదికపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ప్రశ్నించండి... సమాధానాలు వెతకండి.. అబల, దుర్బల అనే మాటలు అర్థాన్ని కోల్పోయాయి.. సబలగా మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి నిరూపించుకుంటున్నారు. ఎన్‌సిసి విద్యార్థులు గ్రామాలకు వెళ్లి ప్రజల జీవన విధానాన్ని అధ్యయనం చేయండి. స్వయం సహాయక మహిళా బృందాలు స్వశక్తిపై ఆధారపడి సాధికారత దిశగా అడుగులేయండి.' అని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అన్నారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, విద్యార్థినులు, విశ్వవిద్యాలయ టీచింగ్ ఫ్యాకల్టీతో రాష్ట్రపతి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంగలి పని అంటే చులకన.. బ్యూటీ పార్లర్ అంటే గౌరవం అంటూ వివక్షతో చూడకూడదన్నారు. పని పనేనని, ఆ పనిని మనం ఎంత ఆత్మగౌరవంతో చేస్తున్నామనేది గమనించాలని పేర్కొన్నారు. క్రీడలు, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్, సంప్రదాయ కళల్లోకి మహిళలు ప్రవేశించి అంకితభావంతో పనిచేస్తూ సత్ఫలితాలను పొందుతున్నారని తెలిపారు. వెనకబడిన పల్లెల్లో ఎన్‌సిసి లేదా ఇతర విభాగాల విద్యార్థినులు కనీసం రెండురోజులు అక్కడే ఉండి ప్రజల జీవన విధానాలను పరిశీలించాలన్నారు. అందువల్ల అఖిల భారత సర్వీసులకు వెళ్లే వారికి ఈ క్షేత్ర అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. క్షేత్ర అనుభవాలను కలెక్టర్‌తో పంచుకుని ఒక నివేదిక ద్వారా వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలన్నారు. 'ఏక్ అకేలా థక్ జాయేగా, తో మిల్కర్ బోఝ్ ఉఠానా ..అనే పాటను గుర్తుచేస్తూ ఒక్కరే పని చేస్తే అలసిపోతారు. కలిసి పని చేస్తే ఎంత భారాన్నైనా సులభంగా మోయొచ్చు' అంటూ ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ఇది సాధ్యపడుతుందని చెప్పారు. ఆడపిల్ల, మగపిల్లలనే విచక్షణ చూపకుండా పెంచాలని తల్లిదండ్రులకు దేశ ప్రథమ మహిళగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. మహిళలు ఏ దేశంలో ప్రగతిపథంలో నడుస్తూ ఉంటారో ఆ దేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ఉంటుందని తెలిపారు 'ఈ విశ్వ విద్యాలయ సందర్శన వల్ల ఎన్నో సమాధానాలు మీ ద్వారా లభించాయి.. ఇది నాకు తృప్తిగా ఉంది' అని ముగించారు. అంతకు ముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట రాష్ట్రపతికి టిటిడి చైర్మన్, ఇఒ, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర క్రీడల సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె రోజా, తదితరులు పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు

తిరుమలలో రెండు రోజుల పర్యటన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్రపతికి సాదర వీడ్కోలు లభించింది. మంత్రులు కె.నారాయణస్వామి, కె. సత్యనారాయణ, దేవాదాయ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, ఎపి అదనపు డిజిపి శాంతి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ జి.భానుప్రకాష్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

ఆధునిక సాంకేతికతలను అనుసరించండి : ఉమ్మారెడ్డి

లాంలో ముగిసిన వ్యవసాయ అగ్రిటెక్ -2022


సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆధునిక సాంకేతికతలను అనుసరించేలా శాస్త్రవేత్తలు రైతులను చైతన్యం చేయాలని శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కోరారు. లాంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడో రోజైన ఆదివారం వ్యవసాయ సాంకేతికతల ముగింపు సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణలో వినూత్న సాంకేతికతలు, ఇంజినీరింగ్ అంశంపై రైతులకు వివరిస్తూ ఆర్‌బికెలను రైతులను ఉపయోగించుకోవాలని కోరారు. ఎపి అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంస్థలు, మార్కెట్ ఇంటిలిజెన్సు అంశాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశం నుంచి వరి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని, ఇందుకు శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. వైస్ చాన్సులర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఏటా ఈ తరహా సదస్సులు, వ్యవసాయ ప్రదర్శనలు కొనసాగిస్తున్నామని తెలిపారు. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ జానకిరాం మాట్లాడుతూ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ద్వారా నాణ్యమైన మొక్కలను అందిస్తున్నామన్నారు. బయోఫోర్టిఫైడ్ ఉద్యాన పంటల రూపకల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆగ్రోస్ సంస్థ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, ఎన్‌జి రంగా యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు ఎల్ ప్రశాంతి, విస్తరణ సంచాలకులు పి రాంబాబు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

అన్నిరకాల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని రకాల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఎంటియు 1061ని 'ఎ' గ్రేడ్‌గానే కొనసాగించాలని బిపిటి 2231 కొనుగోలుపై నిషేధం ఎత్తివేయాలని, రవాణా, హమాలీ ఛార్జీలు పెంచాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సమయంలో ప్రతి ధాన్యపు గింజని కొంటామని ప్రభుత్వం హామీనిచ్చి నేడు మాట మార్చిందని తెలిపారు. ఆరుగాలం కష్టపడి ఎన్నో కష్టనష్టాలకోర్చి పంటలు పండిస్తే ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు పెట్టడమేమిటని వారు ప్రశ్నించారు. నిబంధనలు రైతులకు మేలు చేకూర్చకపోగా ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. ఎంటియు 1061 గతంలో 'ఎ' గ్రేడ్‌రకంగా గుర్తించారని. ఇప్పుడు తొలగించారని, ఫలితంగా ప్రతి క్వింటాకు రైతులు రూ.20 నష్టపోతున్నారని పేర్కొన్నారు. బిపిటి 2231 రకం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో రైతు మద్దతు ధర పొందలేక పోతున్నారని తెలిపారు.

పోస్టింగులు, బదిలీలు చేపట్టాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు



తూర్పుగోదావరి డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణకుమారి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలని, తక్షణమే బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పలు జిల్లాల్లో యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. గుంటూరులోని డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నేతలు మెరుపు ధర్నా చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వేసవి ముగిసేలోపు బదిలీలు, ప్రమోషన్లు పూర్తి చేస్తామని చెప్పి, పాఠశాలలు పునఃప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నా బదిలీలు, ప్రమోషన్లు చేపట్టకపోగా, ఇప్పుడు ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సర్దుబాటు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమన్నారు. విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు తక్షణమే ప్లేస్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీన ప్రక్రియ, జిఒ 117 వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏటువంటి ఉపయోగం లేదని తెలిపారు. అనంతరం డిఇఒకు వినతిపత్రం ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆందోళన చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణకుమారి మాట్లాడుతూ.. వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ విధానాన్ని నిలుపుదల చేయాలని, అర్హత లేని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సబ్జెక్టు బోధకులుగా వేయరాదని డిమాండ్ చేశారు. కడప డిఇఒ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల చేపట్టిన ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ పాల్గొన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో డిఇఒ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. విద్యా శాఖలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు వేయడం, బదిలీలు నిర్వహించక పోవడం అన్యాయమన్నారు. విజయనగరం డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయనగరంలో ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కొత్తవలస, దత్తి రాజేరు ఎంఇఒలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అక్రమ సర్దుబాటును నిలిపివేయాలని కర్నూలు డిఇఒ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా డిఇఒ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసననుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కుమార్ మాట్లాడారు. పని సర్దుబాటు వద్దని, వెంటనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి బదిలీల్లో ప్లేస్‌మెంట్ ఇస్తామని చెప్పి, బదిలీల ప్రస్తావన లేకుండా పని సర్దుబాటు చేయడం, ఉపాధ్యాయులను దూర ప్రాంతాల పాఠశాలలకు మార్చడం తగదన్నారు.

రోజుకో హత్యే బిసి ఉద్ధరణా ?

మాజీమంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పూటకో దాడి, రోజుకో హత్యే బిసి ఉద్ధారణా ? అని టిడిపి మాజీమంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు. మూడున్నరేళ్లుగా బిసిల గొంతు కోయడమే లక్ష్యంగా పాలన సాగుతోందని విమర్శించారు. పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాడి వైసిపి దాష్టీకాలకు నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిసిలపై దాడులు, హత్యలకు పాల్పడుతూ జయహో బిసి అంటూ బిసిలతో సభ పెట్టడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

అవినీతి అవినీతి జగన్ సృష్టే : కొమ్మారెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో రూ.241 కోట్లు జరిగిందంటున్న అవినీతి జగన్ సృష్టే అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈడిని చూసి భయపడి, ఫోన్‌లు పారేసుకోవడానికి తాము కుంభకోణాల్లో మునిగితేలుతున్న వాళ్లం కాదన్నారు.

సుప్రీం తీర్పుతో కళ్లు తెరవాలి : జయరాం

వైఎస్ వివేకానంద హత్యకేసును సుప్రీంకోర్టు వేరే రాష్ట్రానికి బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు నిదర్శమని టిడిపి ఎన్ఆర్ఐ యుఎస్ఎ విభాగం కో ఆర్డినేటర్ కోమటి జయరాం విమర్శించారు. అమెరికాలోని టాంపా నగరంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు జయరాం అధ్యక్షతన సోమవారం జరిగాయి. జగన్ అవినీతి, అరాచకాలకు భయపడి అనేక కంపెనీలు తరలిపోయాయని జయరాం అన్నారు. టిడిపి నాయకులు మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని మంత్రులు, వైసిపి ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు.

రూ.405 కోట్ల విలువైన 833 కేజీల బంగారు పట్టివేత

- స్మగ్లింగ్ ఇన్ ఇండియా నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఏడాదిలో రూ.405.35 కోట్ల విలువైన 833.07 కిలోల స్మగ్లింగ్ బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) తెలిపింది. సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ "స్మగ్లింగ్ ఇన్ ఇండియా" 2021-22 నివేదికను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా కస్టమ్స్ విభాగం రూ.17,394 కోట్ల విలువైన డ్రగ్స్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం రూ. 20,064 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.1,323 కోట్ల విలువైన బంగారం, విదేశీ నగదు స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలో వెల్లడించింది. 28,334.32 కేజీల మత్తు మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. గంజాయి 51 శాతం, హెరాయిన్ 29 శాతం, కొకయిన్ ఎనిమిది శాతం పట్టుబడ్డాయి. 131 మందిని అరెస్టు చేశారు. 13 కేసుల్లో 11.36 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. రూ.9.33 కోట్ల విలువైన 1,102.63 లక్షల సిగరెట్లు స్మగ్లింగ్ అయినట్లు తెలిపింది. 14 కేసుల్లో రూ.97.05 కోట్లు విలువైన 161.83 మెట్రిక్ టన్నుల ఎర్ర చందనం పట్టుకున్నట్లు తెలిపింది. గంజాయి స్మగ్లింగ్‌లో మధ్యప్రదేశ్ (5,846 కేజీలు), త్రిపుర (4,264 కేజీలు), ఉత్తరప్రదేశ్ (3,141 కేజీలు) మొదటి మూడుస్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎనిమిదో స్థానం (1,057 కేజీలు)లో ఉంది.

ఏపిలో స్మగ్లింగ్

ఎర్ర చందనం ఏపిలోని శేషాచలం, పాలకొండ అడవుల్లో కడప, చిత్తూరు జిల్లాల్లో స్మగ్లింగ్ జరుగుతోందని, అనంతపురం, కర్నూల్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ పెరిగిందని తెలిపింది. ఏపిలో అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు ఆయుధాలు స్వాధీనం చేసుకోగా, ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపింది. సిఆర్‌పిఎఫ్ స్వాధీనం చేసుకున్న మాదక ద్రవ్యాల్లో ఏపిలోనే ఎక్కువ ఉన్నాయని తెలిపింది. ఏపిలో 18,267.84 కేజీలు పట్టుబడగా, 90 మంది అరెస్టు చేసినట్లు తెలిపింది. తెలంగాణలో 1,012.04 కేజీలు పట్టుబడగా, ఐదుగురు అరెస్టయ్యారు. ఏపిలో రూ.97 కోట్ల విలువైన 165 టన్నుల ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

ఎలక్టోరల్ బాండ్లకు అదనపు గడువు సరికాదు

- సుప్రీం కోర్టులో ఎడిఆర్ అఫిడవిట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్ల పథకంలో సవరణలు చేస్తూ బాండ్ల విక్రయానికి 15 రోజుల అదనపు గడువును కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఆర్థిక, న్యాయ మంత్రిత్వ శాఖలకు చెందిన కొంత మంది అధికారులు అభ్యంతరాలను లేవనెత్తారని, కానీ వాటిని పక్కన పెట్టి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్‌జిఒ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ (ఎడిఆర్) పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అనుబంధ అఫిడవిట్‌లో పేర్కొంది. ఇప్పటి వరకు 22 విడతల ఎలక్టోరల్ బాండ్ల అమ్మకం జరిగితే, అందులో రూ.10,791.47 కోట్ల విలువైన 19,520 ఎలక్టోరల్ బాండ్లు అమ్మకం జరిగాయని ఆర్‌టిఐ కార్యకర్త కమోడోర్ లోకేస్ కె.బాత్రా దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తుకు 2022 ఆగస్టు 28న ఎస్‌బిఐ సమాధానం ఇచ్చింది.

పెండింగ్ బకాయిలపై 7న ధర్నాలు

ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయ ,కార్మిక, పెన్షనర్లకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలపై బుధవారం అన్ని జిల్లా కలెక్టర్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న వెల్లడించారు. దీనిపై రూపొందించిన కరపత్రాన్ని సోమవారం ఎస్‌టియు కార్యాలయంలో విడుదల చేశారు. మూడేళ్లుగా ఒక్క కరువు భత్యం కూడా విడుదల చేయలేదని తిమ్మన్న అన్నారు. 11వ వేతన సవరణకు సంబంధించి రావాల్సిన బకాయిలు దాదాపు రూ.1800 కోట్లు ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీ అమలు చేయలేదని విమర్శించారు. కెజిబివి ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విలీనాన్ని తక్షణం నిలుపుదల చేసి సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులందికీ పాఠశాలల కేటాయిస్తూ బదిలీలు నిర్వహించాలని కోరారు.

అసలైన బోధనేతర పనులు తగ్గించండి : టిఎన్‌యుఎస్

ఉపాధ్యాయులను అసలైన బోధనేతర పనులకు దూరం చేయాలని టిఎన్‌యుఎస్ అధ్యక్షులు మన్నం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఐదేళ్ల కొక్కసారి, పదేళ్లకొకసారి వచ్చే ఎన్నికలు, జనగణన బోధనకు అడ్డంకి కాదని తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. బోధనేతర పనులు చెప్పబోమంటూ మరుగుదొడ్ల ఫోటోలు, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనులు, ఫోటోలు, జెవికె వంటివి అప్పగించడం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల నుంచి 50-60 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న పాఠశాలలకు పంపి ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదని తెలిపారు. బదిలీలు రేపు, మాపు అంటూ ఐదునెలలుగా చెప్పి ఇప్పుడు సర్దుబాటు అంటున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. విలీనం పేరుతో వసతులు లేకుండా తరగతులు కలపడం వల్ల అనేక పాఠశాలల్లో పిల్లలూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

బిసిల్లో ఆత్మగౌరవం పెంచుతాం

- జయహో బిసి మహాసభపై విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకే జయహో బిసి మహాసభను నిర్వహిస్తున్నట్లు వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తెలిపారు. ఈనెల 7న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న జయహో బిసి మహాసభ ఏర్పాట్లను సోమవారం మంత్రులు, ఎమ్మెల్సీలతో కలసి విజయసాయిరెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో విజయసాయిరెడ్డి, బొత్స మాట్లాడారు. రాష్ట్రంలో బిసిలకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి దాకా మొత్తం రూ.1.79 లక్షల కోట్లు ప్రజలకు నేరుగా అందిస్తే అందులో బిసిలకు రూ.80 వేల కోట్లకు పైగా అందించామని అన్నారు. బిసిలంటే వైసిపికి బ్యాక్‌బోన్‌గా మారిందని తెలిపారు. రాష్ట్రంలో బిసిల నుండి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారందరినీ ఈ మహాసభకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఆహ్వానితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. జయహో బిసి మహాసభ జరిగినట్లుగానే రానున్న కాలంలో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్‌డిసి స్కామ్‌లో చంద్రబాబు పాత్ర : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశంలో హయాంలో స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవకతవకలు జరిగినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలూ గుర్తించాయని, ఈ స్కామ్‌లో చంద్రబాబునాయుడు, లోకేష్ పాత్ర వుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సోమవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దల సహకారం లేకుండా స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్లో అంత అవినీతి జరిగే అవకాశం లేదని తెలిపారు. చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలోనే నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. తమ ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణకు కట్టుబడి వుందని పేర్కొన్నారు. కర్నూలుకు వెళ్లి అమరావతి గురించి చంద్రబాబునాయుడు మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. రాయలసీమకు ఏమీ రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదు మెడికల్ కాలేజీలను రెండు క్యాన్సర్ హాస్పిటళ్లను మంజూరు చేసిందని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి నీటిని తీసుకునేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వైసిపి ప్రభుత్వం చేపడితే కోర్టులో కేసులు వేయించి పనులను అడ్డుకున్నారని విమర్శించారు. కర్నూలు నగరంలో సోమవారం జరిగిన సీమగర్జన సభ విజయవంతం కావడం ద్వారా చంద్రబాబునాయుడు రాయలసీమకు చేసిన ద్రోహం ప్రజలకు తెలిసిందన్నారు.

పోలీసుల అండతో భౌతికదాడులు

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి నేతల అక్రమాలను వెలికి తీస్తున్న టిడిపి నేతలు, కార్యకర్తలపై పోలీసుల అండతో భౌతిక దాడులకు దిగుతున్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రావెల్, మట్టి, మైనింగ్ మాఫియా గుట్టురట్టు చేశారనే కక్షతో చింతమనేని ప్రభాకర్ ముఖ్య అనుచరుడు శివబాబు వైసిపి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి హత్యాయత్నం చేయించాడని తెలిపారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లండన్ నుంచి వచ్చిన అబ్బయ్యని అక్కడికే పంపడం ఖాయమని పేర్కొన్నారు. సిఎం జగన్ ఆధ్వర్యంలో వైసిపి జయహో బిసి సభ నిర్వహిస్తుంటే ఇటు పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి బిసి నేతలను అంత మొందించే కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. పుంగనూరు జనసేన బిసి నాయకుడు రామచంద్రయాదవ్ ఇంటిపై వైసిపి మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బిసి నేతని అంత మొందించే లక్ష్యంతో పెద్దిరెడ్డి మనుషులే దాడికి దిగితే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమని విమర్శించారు.



సెక్యులర్ శక్తుల ఐక్యతతోనే మతోన్మాదులకు గుణపాఠం

బాబ్రీ మసీదు కూల్చివేత, అనంతర పరిణామాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి, సంఘపరివార్‌శక్తుల ఆగడాలను అరికట్టడానికి సెక్యులర్ శక్తులన్నీ ఐక్యం కావాల్సి ఉందని పలువురు ప్రముఖులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బాబ్రీ మసీదు కూల్చివేత జరిగి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. మతోన్మాదులు, కార్పొరేట్లు కలిసి ప్రజలను అన్ని విధాలా దెబ్బతీస్తూ ప్రజల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నారని వారు వివరించారు. సిఎఎ, ఎన్‌ఆర్‌సి పేర్లతో మైనార్టీలను వేరు చేస్తూ పబ్బం గడుపుకునే చర్యలను ప్రతిఘటించాల్సి ఉందని వారు చెప్పారు. వారి స్పందన ఇలా.....

మత సామరస్యం అందరి బాధ్యత

విఠపు బాలసుబ్రమణ్యం, శాసన మండలిలో పిడిఎఫ్ పక్షనేత – నెల్లూరు



భారత దేశంలో శతాబ్దాల తరబడి నెలకొన్న మతసామరస్యం, సుహృద్భావానికి తీవ్రమైన నష్టాన్ని బాబ్రీ మసీదు కూల్చివేత సంఘటన తీసుకొచ్చింది. దీంతో భారతీయ సమాజాన్ని నిట్టనిలువునా చీల్చాలన్న శక్తులకు ఊతమిచ్చింది. ఇలాంటి సంఘటన మరొక సారి ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మతం వ్యక్తిగతమైంది. దానిని ఆ స్థాయిలోనే ఉంచాలి. రాజకీయాలు, పరిపాలన వ్యవస్థలోకి తీసుకురావడం ఆధునిక ప్రపంచంలో ఎవరూ అంగీకరించకూడని అంశం. దాదాపు అభివృద్ధి చెందిన అన్ని సమాజాలూ దీనిని పాటిస్తున్నాయి. ఇంకా మన దేశంలో మాత్రం దీనికి భిన్నంగా వెళ్లే ప్రమాదం మన కళ్లముందు కనిపిస్తోంది. పనిగట్టుకొని హిందూ మతోన్మాద శక్తులు దీనికి పూనుకుంటున్నాయి. దీని పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం. సెక్యులర్ శక్తులను కూడగట్టి ఐక్యంగా నిలబెట్టాల్సిన బాధ్యత ప్రజాస్వామిక సామరస్యపూరిత సంస్కృతికి పునాదులు మరింత బలంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం గతంలో కన్నా మనపై ఉంది. ప్రతి ఒక్కరూ మతసామరస్యానికి బాధ్యతగా ఉండాలి.

మతాధిపత్యం దేశభక్తి అనిపించుకోదు

రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి
కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత – అనంతపురం



మతాధిపత్యం ఏ రకంగానూ దేశభక్తి అనిపించుకోదు. 'అన్నదమ్ముల వలె జాతులు, మతములన్నియు మెలగవలెనోయ్' అన్న గురజాడ సూక్తి నేటికీ సర్వదా సరిపోతుంది. అనేక మతాలు సహజీవనం చేస్తున్న సమాజంలో మత సహనం, సామరస్యం రెండు మార్గాలు. మత సంఘర్షణలు, అసహనమన్నది అనాగరికతకు, కుసంస్కారానికి సంకేతాలు. మత సామరస్యాన్ని అనుసరించడమే నిజమైన దేశభక్తి. భారత దేశం బహుళత్వ నిలయం. దీన్ని ఒంటిస్తంభం మేడగా మార్చే చేయడం తగదు. ఒక మతం మరో మతం మీద... ఒక కులం మరో కులం మీద...ఒక ప్రాంతం మరో ప్రాంతం మీద..ఒక వర్గం ఇంకో వర్గంపై ఆధిపత్యం చెలాయించాలనుకోవడం ప్రజాస్వామ్యం కాదు. భారతదేశం ఎన్నో సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. మత ఘర్షణలు, విద్వేషాలు మౌలిక సమస్యల పరిష్కారానికి అవరోధంగా మారుతాయి.

లౌకిక శక్తులు ఏకం కావాలి

హెని క్రిస్టినా, గుంటూరు జడ్‌పి ఛైర్‌పర్సన్



సమాజంలోని ప్రజాసంఘాలు, సాంస్కృతిక సంఘాలు, మేధావులు, విద్యావేత్తలంతా దేశంలో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నా మతతత్వాన్ని ఎదుర్కొనేందుకు తగిన కార్యాచరణ కొరవడింది. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐక్యవేదికలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తెస్తూ మతతత్వ శక్తులను ఎదుర్కోవాల్సి ఉంది. లౌకిక విధానాల ద్వారానే భారత దేశ భిన్నత్వం కాపాడబడుతుంది. రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో మత స్వేచ్ఛ, లౌకిక వాదానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మత సామరస్యం కొనసాగాలని ఆకాంక్షించారు. కానీ ప్రస్తుత మతతత్వ శక్తులు ప్రజలను మతపరంగా విభజించడం ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించడానికి ప్రయత్నిస్తున్నాయి. గుంటూరులో 100 ఏళ్ల క్రితం నిర్మించిన జిన్నాటవర్ పేరు మార్చాలని కొంత మంది బిజెపి నాయకులు అలజడి సృష్టించడానికి ప్రయత్నించగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సమర్ధవంతంగా తిప్పికొట్టింది. అన్ని మతాలనూ, కులాలనూ పరస్పరం గౌరవించే సంస్కృతి ఉన్న దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టాలన్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి.

రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే కుట్ర

– అఫ్సర్, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి – విజయవాడ



మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత మతోన్మాదాన్ని ప్రజలపై రుద్దుతున్నారు. దీనిలో భాగంగానే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే కుట్ర చేస్తున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ఒక వర్గంపై పనిగట్టుకని విష ప్రచారం చేస్తున్నారు. దానికి కొనసాగింపుగా దాడులు, హత్యలు చేస్తున్నారు. విద్వేష ప్రసంగాలు చేయడంలో భారతదేశం మొదటిస్థానంలో ఉందని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. ప్రపంచ దేశాల్లో ఇంతకంటే అవమానం మరొకటి ఉండదు. కోర్టులు, న్యాయవ్యవస్థలు కూడా ఒక వర్గం కొమ్ముకాసే విధంగా తీర్పులు ఇస్తున్నాయి. ఇది సరైన పద్ధతి కాదు. ఇటీవల సిఎఎ పేరుతో ఒకవర్గాన్ని దేశ ప్రజల నుండి వేరుచేసే విధంగా కేంద్రం వ్యవహారం నడుపుతోంది. తొమ్మిది రాష్ట్రాల్లోని 31 జిల్లాల్లో 1414 మందికి దేశం పౌరసత్వం కల్పించింది. వారిలో ఒక్కరంటే ఒక్కరూ ముస్లిం మైనార్టీ లేరు. దేశంలోని 14 సంవత్సరాలకుపైబడి నివశించిన వారికెవరికైనా రాజ్యాంగం ప్రకారం పౌరసత్వం కల్పించవచ్చు. కానీ అటువంటి చర్యలేమీ కేంద్రం తీసుకోకపోగా ఉద్దేశ పూర్వకంగా రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోంది. అయోధ్య కథ ముగిసిన తరువాత ఇప్పుడు కొత్తగా తాజ్‌మహల్, అజ్మీర్ దర్గాలను తవ్వాలని కేంద్రంలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న కొంతమంది నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. కానీ కోర్టులను ఆశ్రయించినా వారికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు సిద్ధపడటం లేదు. చట్టం ప్రకారం నడుచుకోవాలి. ఇటీవల కాలంలో ఒక మతాన్ని ఇబ్బంది పెట్టే విధంగా పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆచరణలో లౌకికతత్వం అనే పదాన్ని వినడానికి కేంద్ర పెద్దలు ఉద్దేశ్యపూర్వకంగానే ఇష్టపడడం లేదు. ఇప్పటికైనా కేంద్రం లౌకికతత్వాన్ని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారి పట్ల అప్రమత్తం

– ఎం.ఎ.చిష్టీ, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ –గుంటూరు



బాబ్రీమసీదు కూల్చివేత, దేశ రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే ఫాసిస్టు శక్తులు, కార్పొరేట్ శక్తులు రెండూ మిలాఖత్ అయి దేశాన్ని పరిపాలిస్తున్నాయి. ఫాసిస్ట్ శక్తులు మతోన్మాదాన్ని రెచ్చగొడితే కార్పొరేట్ శక్తులు ఆర్థిక దోపిడీ చేస్తున్నాయి. విశ్వాసాల ఆధారంగా న్యాయస్థానం తీర్పునైతే ఇచ్చింది కానీ న్యాయం జరగలేదు. ఈ తీర్పు లౌకికవాదాన్ని, మతసామరస్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెట్టివేసేలా ఉంది. దేశాన్ని విభజించే విచ్ఛిన్నకర, మతోన్మాద శక్తులు ఐక్యమై ఉన్నాయి. దానికి వ్యతిరేకంగా దేశ సమైక్యత, సమగ్రతలను కోరే లౌకిక అభ్యుదయ శక్తులు ఏకమవ్వాలి. మత సామరస్యాన్ని కాపాడేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న, మత విద్వేషాలు రెచ్చగొడుతున్న శక్తులను ప్రజలే తిప్పికొట్టాలి. అందుకు భావజాలరంగంలో అభ్యుదయ వాదులూ, మేధావులు గట్టి కషి చేయాల్సిన అవసరం ఉంది. జాతీయోద్యమ స్ఫూర్తితో లౌకిక సామ్యవాద భావజాల వ్యాప్తి కోసం సాంస్కృతిక రంగంలో కూడా కషి చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో మతసామరస్యం పెంపొందించడానికి అభ్యుదయ శక్తులు ఏకమవ్వాలి. ప్రజల్లో చైతన్యం తెస్తూ మతతత్వ శక్తులను ఎదుర్కోవాలి. ఆ విధంగా భిన్నత్వంలో ఏకత్వం అయిన మన వారసత్వాన్ని, ప్రజా పోరాటాలు, ఉద్యమాల ద్వారానే మనం కాపాడుకోగలం. విద్వేష రాజకీయాలకు చరమగీతం పాడి మతసామరస్యాన్ని కాపాడుకోగలం.

కర్నూలుకు హైకోర్టు వచ్చే వరకూ పోరాటం

- రాయలసీమ గర్జనలో మంత్రులు, వక్తలు

ప్రజాశక్తి – కర్నూలు ప్రతినిధి

కర్నూలుకు హైకోర్టు వచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని మంత్రులు, వక్తలు పేర్కొన్నారు. న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో కర్నూలు మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన సోమవారం రాయలసీమ గర్జనను నిర్వహించారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా మాట్లాడుతూ.. 1937 నుంచి మరుగున పడిన శ్రీబాగ్ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి అన్ని ప్రాంతాలకూ న్యాయం చేయాలని జగన్ ముందుకు వెళ్తుంటే టిడిపి నాయకులు ఒకే రాజధాని అంటున్నారని విమర్శించారు. ఉద్యమం ఆరంభమైందని, జెఎసికి మద్దతునిస్తున్నామని, న్యాయరాజధాని సాధించుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. గతంలోని ముఖ్యమంత్రులు హైద్రాబాద్‌ను తప్ప ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలనే వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని తాము తీసుకొచ్చామని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి

చంద్రబాబును రాయలసీమ దోషిగా పరిగణించాలన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్నూలులో హైకోర్టు పెట్టడాన్ని టిడిపి నాయకులు ఎందుకు అడ్డుకుంటున్నారు. కర్నూలులో హైకోర్టు పెట్టడం చంద్రబాబుకు ఇష్టం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, టిడిపికి రియల్ ఎస్టేట్ బృందం మీద తప్ప ఎవరి మీదా ప్రేమ లేదన్నారు. అందరి అభిప్రాయాల మేరకే కర్నూలులో హైకోర్టు పెట్టాలని సిఎం అనుకున్నారని, పది కిలోమీటర్ల మేర కనపడేలా జగన్నాథగట్టుపై హైకోర్టు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. 80 ఏళ్లుగా ఎంతో నష్టపోయామన్నారు. కర్నూలు పేరుతో వేల కోట్లు సంపాదిస్తున్న చిత్రపరిశ్రమకు చెందినవారు కర్నూలులో హైకోర్టును డిమాండ్ చేయాలన్నారు. మంత్రి ఉష శ్రీచరణ్ మాట్లాడుతూ.. చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసమే ఒకే రాజధాని అంటున్నారని విమర్శించారు. శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎంపిలు సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోరుముట్ల శ్రీనివాసులు, శిల్పాచక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, జెఎసి ఛైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి, విద్యార్థి జెఎసి అధ్యక్షులు సునీల్ రెడ్డి, తదితరులు ప్రసంగించారు.

కౌలురైతు పేరుతో బోగస్ కార్డులు

- బాధిత రైతుల ఫిర్యాదు..
- సమగ్ర విచారణకు జెసి హామీ

ప్రజాశక్తి – పల్నాడు జిల్లా

వ్యవసాయం చేయకుండానే 250 మందికిపైగా కౌలు గుర్తింపు కార్డులు పొందడంతో పాటు, రైతు భరోసానూ పొందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తనకు రైతు భరోసా జమ కావడం లేదని ఓ రైతు సచివాలయం ద్వారా విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. దీంతో బాధిత రైతులంతా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన 60 మంది రైతులు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో జెసి ఎ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికార్లు, రైతు భరోసా కేంద్రం ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూములు ఎవరికీ కౌలుకు ఇవ్వలేదని, అయినా సంతకాలను ఫోర్జరీ చేసి మూడేళ్లుగా రూ.11,500 రైతు భరోసాతోపాటు ప్రభుత్వం అందిస్తున్న



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

ఇతర రాయితీలనూ పొందుతున్నారని తెలిపారు. లబ్ధి పొందుతున్న వారెవరూ వ్యవసాయం చేయడంలేదని వివరించారు. తమ పాస్ పుస్తకాలు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 1 బి, అడంగల్ నకళ్లను గతంలో వలంటీర్లకు ఇచ్చామని తెలిపారు. వాటి ఆధారంగా ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏడాదికి రూ.30 లక్షలు చొప్పున మూడేళ్లపాటు రూ.కోటి వరకూ కాజేశారన్నారు. ఈ మేరకు తమ వద్ద ఉన్న ఆధారాలను జెసికి అందించారు. దీనిపై ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేయిస్తామని జెసి హామీనిచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు బండారు వెంకటేశ్వర్లు, సాంబయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, కిరణ్ ఉన్నారు.

రాష్ట్ర సమస్యలపై పోరాడండి

- టిడిపి ఎంపిలకు చంద్రబాబు దిశానిర్దేశం

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడాలని టిడిపి ఎంపిలకు మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేసే అవినీతిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. సోమవారం నాడిక్కడ టిడిపి ఎంపి గల్లా జయదేవ్ నివాసంలో పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చంద్రబాబుతోపాటు టిడిపి ఎంపిలు గల్లా జయదేవ్, కె.రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, కనకమేడల రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన వ్యూహం, లేవనెత్తాల్సిన అంశాలపై ఎంపిలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర సమస్యలను లేవనెత్తాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను సభల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లిస్తూ దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్రం జోక్యం చేసుకొని, చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌జిటి ఆదేశాలను ఖాతరు చేయకుండా అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో చర్చతో పాటు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. రాష్ట్రం కోసం రాజీనామాలు చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కనకమేడల రవీంద్ర కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు రోజు రోజుకీ దిగజారిపోతున్నాయని, ప్రాథమిక హక్కులు హరించే విధంగా పాలన ఉందని విమర్శించారు. చంద్రబాబు యాత్ర, అమరావతి రైతుల పాదయాత్రపై పోలీస్ చర్యను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని తెలిపారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థి మృతి

ప్రజాశక్తి – వేంపల్లె

గుండెపోటుతో కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు..మెకానికల్ ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న వెంకటసాయి శంకర్ (21) స్నేహితులతో కలిసి సోమవారం ఉదయం వ్యాయామం చేశారు. తిరిగి హాస్టల్‌కు వస్తుండగా గుండెనొప్పి రావడంతో తోటి స్నేహితులు వెంకటసాయిని ఇడుపులపాయలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటసాయి స్వగ్రామం కడప జిల్లా బి.కోడూరు మండలంలోని గోవిందపల్లె. గుండెపోటుతో వెంకట సాయి మృతి చెందడం బాధాకరమని డైరెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటసాయి శంకర్(ఫైల్)

కిడ్నీ వ్యాధికి మరో మహిళ బలి

ప్రజాశక్తి–ఎ.కొండూరు

కిడ్నీ వ్యాధికి మరో మహిళ బలైంది. మహిళ భర్త ఎలీషారావు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం పాలెం గ్రామానికి చెందిన దాసరి కృష్ణకుమారి (46) ఐదేళ్ల నుండి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ సోమవారం మరణించింది. ఆమెకు వైద్యానికి రూ.పది లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. కృష్ణకుమారి మృతదేహాన్ని సిపిఎం నాయకులు పానెం ఆనందరావు సందర్శించి నివాళు లర్పించారు. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జనవరి నుండి సుమారు 40 మంది వరకు కిడ్నీ వ్యాధి వల్ల మృతి చెందారని, వారందరికీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని కోరారు.

మూఢనమ్మకంతో మహిళ హత్య

- ఓ కసాయి భర్త ఘాతుకం

ప్రజాశక్తి – దుగ్గిరాల (గుంటూరు జిల్లా)

మెదడు నిండా మూఢ నమ్మకాన్ని నింపుకున్న వ్యక్తి భార్యనే దారుణంగా హత్య చేసిన ఘటన గుంటూరు జిల్లా రేవేంద్రపాడులో చోటుచేసు కుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పుల ప్రసాద్‌కు చర్మ వ్యాధి కారణంగా వంటి మీద మచ్చలు వచ్చాయి. చేతబడి చేశారని ఎవరో చెప్పారు. తన భార్య ఎస్తేరు రాణి (42) ఈ పని చేయించి ఉంటుందని అనుమానించాడు. ప్రసాద్ ఈ నెల 1న పచ్చడిబండతో భార్య తలమీద కొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను తెనాలిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఆమె సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు దుగ్గిరాల ఎస్ఐ ఎ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సంపాదకీయం

ఉద్యోగ అభద్రత!

కంటిపై కునుకు లేకుండా స్వల్ప జీతాలతో దినదినగండంగా అస్తుబిస్తు బతుకీడుస్తున్న ఔట్‌సోర్స్ ఉద్యోగులను మొత్తానికే ఇంటికి సాగనంపే కర్కశానికి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణం. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు, యూనివర్శిటీలు, పలు సర్కారీ స్కీముల్లో రెండున్నర లక్షల మంది ఔట్‌సోర్స్ ఉద్యోగులు పని చేస్తున్నారు. అందరిపైనా ఒకేసారి వేటు వేస్తే మొదటికే మోసం వస్తుందని తలంచి, దఫదఫాలుగా కత్తి ఝుళిపించాలనుకున్నట్లుంది. మొదటి విడతలో పదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉద్యోగులను ఉన్నపళాన ఉద్యోగం నుంచి బయటికి గెంటేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ వర్క్స్, అకౌంట్స్ డిపార్టుమెంట్ కాన్ఫిడెన్షియల్ ఆదేశాలిచ్చింది. చర్యలు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభం కావడంతో ఔట్‌సోర్స్ ఉద్యోగుల్లో ఆందోళన తారాస్థాయికి చేరుకుంది. పదేళ్లకుపైన సర్వీసు కలిగిన వారిని పర్మినెంట్ చేస్తారన్న ఊహాగానాలు ఉండగా, ఇప్పుడిలా జరగడంతో తమ భవితవ్యం ఏమవుతుందోనని బెంబేలెత్తుతున్నారు.

ఔట్‌సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్నది ఆధునిక వెట్టి. నయా-ఉదార విధానాలు శాసించినట్లు ప్రభుత్వాలు కొన్నేళ్లుగా శాశ్వత నియామకాలు చేపట్టట్లేదు. దాంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగులు అవసరమయ్యారు. ప్రభుత్వం నడిచేది వారిపైనే. ఎన్నెన్నో పోరాటాలు చేస్తేగాని ఇప్పటికి వారు పొందుతున్నది నెలకు రూ.16 వేల నుంచి 23 వేలు. ఉద్యోగ భద్రత, ఇతర బెనిఫిట్లు నాస్తి. రెగ్యులర్, తాత్కాలిక ఉద్యోగులు చేసేది ఒకే తరహా పని. టెంపరరీ ఉద్యోగులపైనే పని భారం అత్యధికం. వీరి ఆందోళనలపై నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్, ఔట్‌సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి-సమాన వేతనం అమలు చేసి న్యాయం చేస్తామని, ఏ ఒక్కరినీ తొలగించబోమని భరోసా ఇచ్చారు. ఇప్పుడు ఉద్యోగాలకే మంగళం పాడేందుకు ఏకంగా ఉత్తర్వులిచ్చింది ఆయన సర్కారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలుకావడంతో ముఖ్యమంత్రికి తెలీకుండా ఆ ఉత్తర్వులొచ్చాయని, ఆయన ఆగ్రహం వ్యక్తపర్చారనీ ప్రభుత్వ సలహాదారు సజ్జల మీడియాకు చెప్పారు. అయితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులెవరినీ తొలగించబోమని మాత్రం ఆయన చెప్పలేదు. మరో వైపు మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ కొన్ని శాఖల్లో పనిలేని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుంటే వారికి మాత్రమే ఆ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం ఉత్తర్వుల ఉపసంహరణ జరగలేదు కనక ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి వెల్లడిస్తేనే స్పష్టత వస్తుందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధి రహిత రాష్ట్రమైంది. చదువుకున్న యువత ఉపాధికి దిక్కులు చూస్తోంది. పొట్ట చేతపట్టుకొని హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, ముంబయిలకు వలస బాట పట్టింది. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెచ్చి ప్రతి పట్టణాన్నీ ఒక్కొక్క మహానగరం చేస్తామని ఎన్నికల ముందు వైసిపి ఇచ్చిన హామీ ఆచరణకు రాలేదు. కేంద్ర బిజెపి హోదాను ముగిసిన అధ్యాయంగా కొట్టి పారేసినా వైసిపి ప్రభుత్వంలో చలనం లేదు. తామొస్తే ప్రతి ఏడాదీ జనవరి ఒకటిన జాబ్ కేలండర్ అనగా మూడున్నరేళ్లలో ఒక కేలండర్ అదీ పది వేల పోస్టులకు విడుదలైంది. ఇంకా రిక్రూట్‌మెంట్ బాలారిష్టాలు దాటలేదు. ప్రభుత్వంలో రెండు లక్షల ఖాళీలున్నా రిక్రూట్‌మెంట్ చేపట్టట్లేదు. 'సచివాలయ' ఉద్యోగాలనే గొప్పగా చెబుతున్నారు. ప్రైవేటు ఏజెన్సీల దోపిడీ నుంచి కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ వారిని కాపాడేందుకంటూ 'ఆప్కాస్'ను తెచ్చిన సర్కారు, ఇప్పుడు ఇలా వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఔట్‌సోర్స్ ఉద్యోగులను ఇంటికి పంపే అన్ని ప్రయత్నాలూ మానుకోవాలి. ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకొని వారి ఉద్యోగ భద్రతపై స్పష్టంగా ప్రకటించడం దాని ధర్మం.

సందర్భం

దేశ సమగ్రత, ప్రజల ఐక్యతకు
లౌకికవాదమే శిరోధార్యం

యం.ఎ. గఫూర్



డిసెంబర్ 6 అంటేనే, ముప్పై సంవత్సరాల కిందట బాబ్రీ మసీదును మనువాద ముష్కరులు దాడి చేసి దౌర్జన్యంగా అయోధ్య లోని చారిత్రక కట్టడాన్ని కూల్చివేసిన రోజు. లౌకికవాద రాజ్యాంగానికి ఆరోజు జరిగిన గాయం ప్రతి సంవత్సరం గుర్తుకొస్తూనే ఉంటుంది. అదే రోజు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి కూడా. బాబ్రీ మసీదు పైనే కాకుండా అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై దాడి చేయడానికి గాను బహుశా అదే తేదీని ఈ దాడికి ఎంపిక చేసుకున్నారేమో. మూడు దశాబ్దాలు గడిచిపోయాయి. కానీ లౌకిక రాజ్యాంగంపై దాడి నేటికీ కొనసాగుతూనే ఉన్నది. కాశీ లోని జ్ఞానవాపి మసీదును, మధుర లోని షాహి ఈద్‌గానూ స్వాధీనం చేసుకుంటామని సంఘ్ పరివార్ శక్తులు ప్రతిరోజూ హెచ్చరికలు చేస్తూనే ఉన్నాయి. ప్రాచీన కట్టడాల పరిరక్షణకై కట్టుబడి ఉంటామని సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం పదే పదే హామీలిచ్చినా, పార్లమెంటు ప్రత్యేక చట్టం చేసినా... సంఘ్ పరివార్ శక్తులు వాటిని లెక్క చేయకుండా ప్రతి చారిత్రక కట్టడానికి మతం రంగును పులుముతూ...ఇది తమ ఆత్మగౌరవ సమస్యగా చిత్రీకరించి ఒక మతం ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత భారత రాజ్యాంగానికి ప్రమాదం రోజు రోజుకు పెరుగుతూ ఉంది.

బిజెపి మాతృకైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ రోజూ భారత రాజ్యాంగాన్ని తమదిగా భావించడం లేదు. రాజ్యాంగం లోని ప్రజాస్వామ్యం, లౌకికతత్వం అనే పదాలు పాశ్చాత్య దేశాల ప్రభావంతో చేర్చబడినవిగా ఆర్.ఎస్.ఎస్ భావిస్తోంది. భారత దేశానికి ప్రజాస్వామ్య వ్యవస్థ పనికి రాదని కొందరు నిబద్ధులైన, దేశం పట్ల అంకిత భావం కలిగిన ధర్మకర్తలు ఈ దేశాన్ని పరిపాలించాలని వారి భావన. అందుకే గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీ లాంటి శత సహస్ర కోటీశ్వరులకు దేశ ఆర్థిక వ్యవస్థను అప్పజెప్పడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటీకరణ, ద్రవ్యీకరణ లాంటి అందమైన పదాలను జోడించి ప్రజా సంపదనంతా కట్టబెట్టడానికి, ప్రకృతి వనరులు యథేచ్ఛగా కొల్లగొట్టడానికి అనుమతులిస్తున్నారు. కార్పొరేట్లకు లొంగిపోయి వీరు చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలు గమనించకుండా ఉండేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మతాల పేర్లతో వైషమ్యాలను సృష్టిస్తూ భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తున్నది. రాజ్యాధికారాన్ని ఉపయోగించుకుని ఆర్.ఎస్.ఎస్ ఎజెండాను అమలు జరిపే కార్యక్రమాన్ని మోడీ సర్కార్ వేగవంతం చేస్తోంది.

భారతదేశం బ్రిటీష్ పాలన కంటే ముందు ఒక దేశంగా లేదు. అనేక దేశాల సమూహంగా ఉన్నది. అనేక భాషల ప్రజలు, అనేక మత విశ్వాసాలతో ఉన్నవారంతా కలసి మెలసి ఒకే రాజ్యంలో సహజీవనం చేసే సత్ సాంప్రదాయం వందల సంవత్సరాలుగా భారత ప్రజల మధ్య ఉన్నది. హిందూ రాజుల వద్ద ఇతర మతాలకు చెందిన సైనిక అధికారులు, మంత్రులు, ముస్లిం రాజుల వద్ద హిందూ మతానికి చెందిన మంత్రులు, సైనిక అధికారులు ఉండేవారు. ఆధిపత్యం కోసం రాజ్య కాంక్షతో యుద్ధాలు తప్ప...ఆనాడు జరిగిన యుద్ధాలేవీ మత యుద్ధాలు కావు. బ్రిటీష్ ప్రభుత్వం జాతీయోద్యమంలో చీలిక తెచ్చి తమ పాలనను కొనసాగించడం కోసం 'విభజించి పాలించు' సూత్రంలో భాగంగా భారతీయ ప్రజల మధ్య హిందూ, ముస్లిం మతాల పేరుతో ప్రజల్ని విభజించే కార్యక్రమం చేసింది. బాబ్రీ మసీదు వివాదం కూడా బ్రిటీష్ కుట్రలో భాగమే. దేశ విభజన జరిగిన సందర్భంలో జరిగిన మారణహోమానికి కూడా బ్రిటీష్ నాటిన మత విభజన విష బీజమే కారణం. అందుకే స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని లిఖించడానికై ఏర్పడిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో నాటి జాతీయోద్యమ నాయకులందరూ ప్రజల మధ్య ఐక్యత, దేశ సమగ్రత కాపాడుకోవడానికై అన్ని మతాలను సమ భావనతో చూసేలా, అన్ని విశ్వాసాలను సమానంగా గౌరవించేలా రాజ్యాంగం ఉండాలని భావించారు. అందుకే రాజ్యాంగ పీఠికలో ఈ విషయాన్ని ఇలా ప్రస్తావించారు. "భారత పౌరులందరికీ సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ న్యాయం, భావము, భావ ప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన స్వాతంత్ర్యము, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వమును చేకూర్చుటకు మరియు వారందరిలో వ్యక్తి గౌరవము, జాతి ఐక్యతను, అఖండతను, సౌభాతృత్వమును, పెంపొందించుటకు, సత్యనిష్టా పూర్వకంగా తీర్మానించడమైనది.".

రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ఆయన అనుయాయులు ప్రారంభం నుండి మత విద్వేషాన్ని పెంచడానికి తమ పాలనను వినియోగిస్తున్నారు. గో రక్షణ పేరుతో ముస్లింలు, దళితుల పైన దేశవ్యాప్తంగా దాడులు జరిగాయి. అనేక మంది అమాయకులు గో మాంసాన్ని తిన్నారనో, అమ్మారనో ఆరోపణలకు గురై సామూహిక హత్యలకు బలయ్యారు. శాంతి భద్రతలు కాపాడాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలిచ్చినా, ఆ ఆదేశాలను పట్టించుకోనవసరం లేదని గోరక్షకులు చేస్తున్న పవిత్ర కార్యక్రమాన్ని కొనసాగించమని ఆర్.ఎస్.ఎస్ అధినేత మోహన్ భగవత్ బహిరంగంగా పిలుపునిచ్చారు. దీన్నిబట్టే భారత రాజ్యాంగంపై వీరికున్న ప్రేమ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత కూడా లవ్ జిహాద్, ఘర్ వాపసీ లాంటి పిలుపులతో ముస్లిం మైనార్టీలపై విద్వేషాన్ని పెంచడం, దాడులు నిర్వహించడం చేస్తూనే ఉన్నారు. ముస్లిం పర్సనల్ లా ను పూర్తిగా మార్చివేస్తామని హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. మత విద్వేషాన్ని పెంచే కార్యక్రమంలో భాగంగా పౌరసత్వ చట్టాన్ని సవరించి భారత దేశంలో ఉంటున్న ముస్లింలు మినహా ఇతర మతాల వారికి మాత్రమే పౌరసత్వాన్ని ఇస్తామని చట్టం చేయడం దానికి పునాదిగా ఎన్.ఆర్.సి, ఎన్.పి.ఆర్ లను రూపొందించి ముస్లింలను దేశం నుంచి పంపేస్తామని బెదిరించడం...హిజాబ్, హలాల్ పేర్లతో అల్లర్లు సృష్టించడం ఇవన్నీ కూడా ఆర్.ఎస్.ఎస్ ఎజెండాలో భాగమే. హిందీ - హిందూ - హిందూస్తాన్ అన్నది ఆర్.ఎస్.ఎస్ నినాదం. దేశంలో గుర్తింపు కలిగి కోట్లాది మంది ప్రజలు మాట్లాడే భాషలు 26కు పైగానే ఉన్నాయి. ఇవి కాక చిన్న చిన్న సమూహాల ప్రజానీకం మాట్లాడే భాషలు గిరిజనులు మాట్లాడే భాషలు కలిపితే వందల భాషలు భారత ప్రజానీకం మాట్లాడుతున్నారు. హిందీ భాష తప్ప మిగతా భాషలన్నింటినీ ధ్వంసం చేయాలని ఆర్.ఎస్.ఎస్ ప్రయత్నం. అలాగే భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు, జైన, జొరాస్ట్రియన్ లాంటి మతాలకు చెందిన ప్రజలతో పాటు పై మతాలకు చెందకుండా ప్రకృతి శక్తులను ఆరాధిస్తూ, పూజిస్తూ ఉండే గిరిజన తెగలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఈ మతాలన్నింటినీ అణచివేసి హిందూ మతాధిక్యతను స్థాపించాలనేది ఆర్.ఎస్.ఎస్ లక్ష్యం. అలాగే దేశ విభజన తరువాత పాకిస్తాన్ ఒక మత రాజ్యంగా ఏర్పడినందున తమకు కూడా హిందూస్థాన్ అనే హిందూ మత రాజ్యం స్థాపించాలని ఆర్.ఎస్.ఎస్ ప్రయత్నిస్తున్నది.

ప్రపంచంలో మధ్యయుగాల్లో తప్ప ఆధునిక యుగంలో మత రాజ్యాలు మనుగడ సాగించలేవు. ఐరోపా దేశాల్లో అత్యధికం, అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో అత్యధికులు క్రైస్తవ మత విశ్వాసులే అయినా ఆ రాజ్యాలు మత రాజ్యాలుగా లేవు. వాటి రాజ్యాంగంలో సెక్యులర్ వ్యవస్థను నెలకొల్పుతామని రాసుకున్నారు. అమలు చేస్తున్నారు. అరబిక్ దేశాల్లో మత రాజ్యాలుగా కొన్ని చెప్పుకుంటున్నా వాటిలో కూడా క్రమేపీ మార్పులొస్తున్నాయి. పరమత సహనం ఒక విధానంగానే అమలు చేస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ లాంటి మతోన్మాద ప్రభుత్వాలు గల దేశాలు ఏ అభివృద్ధికి నోచుకోక పతనం వైపు ప్రయాణం చేస్తున్నాయి. భారతదేశంలో మెజార్టీ మతానికి చెందిన ప్రజలతో పాటు ఇతర మతాల ప్రజలు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక మతం ఆధిపత్యంలో రాజ్య స్థాపన చేసి ఆ మత ధర్మాలను బలవంతంగా అమలు చేయాలని చూస్తే దేశ సమగ్రత ప్రమాదంలో పడుతుంది. దేశంలో ఉండే వందల భాషలను రూపుమాపి ఒక భాష ఆధిపత్యం తేవాలని ప్రయత్నిస్తే కోట్ల మంది ప్రజలు ఈ రాజ్యం యొక్క అస్తిత్వాన్నే ప్రశ్నిస్తారు. అందుకే రాజ్యాంగ నిర్మాతలు జాతీయోద్యమ వారసత్వాన్ని కొనసాగించడానికి మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో ఆ అంశాలను చేర్చారు. అయితే సంఘ్ పరివార్ చేతిలో నేడు రాజ్యాంగం అపహాస్యానికి గురికాబడుతున్నది. ఇతర మతాల ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం కల్పించి ప్రజల మధ్య విభజన తేవాలని సంఘ్ పరివార్ భావిస్తున్నది. బాబ్రీ మసీదు కూల్చివేత ఒక గాయమైతే, సంఘ్ పరివార్ చేతిలో భారత రాజ్యాంగం మరెన్నో గాయాలకు గురికావాల్సిన పరిస్థితులు నేడు ఉన్నాయి. లౌకిక వాదులు, ప్రజాస్వామ్య ప్రియులు భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా రాజ్యాంగ విలువల పరిరక్షణకు లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైనది.

విస్మరిస్తే మరెన్నో ప్రార్థనా స్థలాలు నేలమట్టం కావడం, మరెన్నో భౌతిక దాడులు మైనార్టీ, దళిత, క్రైస్తవ సోదరులపై జరగడం, ఎందరో అమాయకులు హత్యాకాండకు గురికావడం చూడాల్సి వస్తుందని గమనించాలి.

(వ్యాసకర్త : సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు)



అందుకే రాజ్యాంగ నిర్మాతలు జాతీయోద్యమ వారసత్వాన్ని కొనసాగించడానికి ...మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో ఆ అంశాలను చేర్చారు. అయితే సంఘ్ పరివార్ చేతిలో నేడు రాజ్యాంగం అపహాస్యానికి గురికాబడుతున్నది. ఇతర మతాల ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం కల్పించి ప్రజల మధ్య విభజన తేవాలని సంఘ్ పరివార్ భావిస్తున్నది. బాబ్రీ మసీదు కూల్చివేత ఒక గాయమైతే, సంఘ్ పరివార్ చేతిలో భారత రాజ్యాంగం మరెన్నో గాయాలకు గురికావాల్సిన పరిస్థితులు నేడు ఉన్నాయి. లౌకిక వాదులు, ప్రజాస్వామ్య ప్రియులు భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా రాజ్యాంగ విలువల పరిరక్షణకు లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైనది.

విశ్లేషణ

బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత...

ఎం.వి.ఎస్. శర్మ

ప్రజాస్వామ్య, లౌకిక భారత చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిపోయిన బాబ్రీ మసీదు విధ్వంసం జరిగి నేటికి 30 సంవత్సరాలు. ఒక పథకం ప్రకారం సంఘ్‌పరివార్ గూండాలు 30 ఏళ్ల క్రితం డిసెంబర్ ఆరున బాబ్రీ మసీదును నేలమట్టం చేశారు. ఆ స్థలంలో కొంత ప్రాంతంలో రామాలయాన్ని నిర్మించుకోవచ్చునని సుప్రీం కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. అదే సమయంలో అక్కడ కూలగొట్టిన మసీదు గురించి ఏ విధమైన ప్రస్తావనా ఆ తీర్పులో లేదు. న్యాయ వ్యవస్థ మతపరమైన విశ్వాసాల విషయంలో హిందూత్వ, ఛాందసవాద శక్తులకు అనుకూలంగా తీర్పునివ్వడం లౌకిక భారతంలో నెలకొన్న దుస్థితిని సూచిస్తుంది. ఆ తర్వాత కాలంలో కూడా (శబరిమలై లోకి మహిళలు రాకూడదన్న తీర్పు ఉదాహరణ) మెజారిటీ ప్రజల మత విశ్వాసాల ప్రాతిపదికన తీర్పులిచ్చే ధోరణి కొనసాగింది. ఇది రాజ్యాంగం మీద సంఘపరివార్ ఆధ్వర్యంలో జరుగుతున్న దాడిని పరోక్షంగా బలపరచడమే. పౌర హక్కుల కోసం, మైనారిటీల హక్కుల కోసం పోరాడే లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు ఇదొక సవాలు. మరోవైపు అయోధ్యలో రామాలయం నిర్మాణం కోసం మరోసారి ఆరెస్సెస్ దేశ వ్యాప్తంగా నిధుల సేకరణకు పూనుకుంది. విదేశాలనుండి కూడా నిధులు పెద్దఎత్తున సేకరించారు. ఆలయ నిర్మాణం ఇంకా కొనసాగుతూనేవుంది. బహుశా 2024 ఎన్నికల నాటికి పూర్తి చేసి "అయోధ్య లో పని పూర్తి చేశాం. వారణాసి, మధుర సంగతి తేల్చడానికి మరోసారి అధికారం ఇవ్వండి" అని ప్రజలదగ్గరికి పోవాలన్నది వ్యూహం కావచ్చు.

మత విద్వేష ఎజెండా రాజకీయంగా ఫలితాలను ఇవ్వాలంటే అందులో హింస ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఒకసారి మత కల్లోలాలు జరిగిన చోట ప్రజలలో పరస్పరం ద్వేషం గూడుకట్టుకుపోయి మెజారిటీ, మైనారిటీగానే ఆలోచిస్తారు, స్పందిస్తారు. అద్వానీ రథయాత్రతో తలెత్తిన మత హింస, ఘర్షణలు ఆ తర్వాత దేశంలో వివిధ ప్రాంతాల్లో కొనసాగుతూనే వున్నాయి. మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయి. యు.పి, బీహార్ లలో రామాలయ వివాదం పేరుతో జరిగితే, 1993లో ముంబాయిలో, ఆ తర్వాత గుజరాత్ లో, కర్నాటకలో జరిగాయి. 2012 నుంచీ 2014 ఎన్నికల వరకూ ఒక్క యు.పి లోనే దాదాపు 70 చోట్ల మత ఘర్షణలు జరిగాయి. సిఎఎ ఆందోళన సందర్భంగా దేశ రాజధాని నగరం ఢిల్లీ లోనూ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కాశ్మీర్ లో సైన్యాన్ని ఉపయోగించుకుని మైనారిటీలపై దాడులు చేస్తున్నారు. చివరికి జమ్ము-కాశ్మీర్ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి రాష్ట్ర హోదాను లేకుండా చేసినా దేశంలో వామపక్షాలు మినహా ఖండించినవారు లేరు. ఈ విధమైన ఆధిపత్యం రావడానికి బిజెపికి కార్పొరేట్ల నుండి వస్తున్న మద్దతు, ధన ప్రవాహం, కార్పొరేట్ మీడియా ఇస్తున్న కవరేజి చాలా వరకు తోడ్పడింది. బిజెపి మతతత్వ భావజాలం ప్రజల ఆలోచనలపై ఆధిపత్యాన్ని సాధించింది. అందుకే మోడీ ప్రభుత్వం మొదట గుజరాత్ లో గాని, తర్వాత దేశం మొత్తం మీద కాని ప్రజల సమస్యల పరిష్కారంలో అత్యంత ఘోరంగా విఫలమైనా, పబ్లిక్ గా కార్పొరేట్లకు దోచిపెడుతున్నా, ఎన్నికల్లో అధికారాన్ని నిలబెట్టుకుంటూనే వుంది. రాజ్యాంగ వ్యవస్థలనన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకునే దిశగా వేగంగా సాగుతోంది. రాజ్యాంగ మౌలిక విలువలనన్నింటినీ నాశనం చేయడం లక్ష్యంగా పెట్టుకుని వ్యవహరిస్తోంది. ఏకపార్టీ. ఏకవ్యక్తి పాలన దిశగా నడుస్తోంది. బిజెపి-పాలిత రాష్ట్రాలలో పోలీసు యంత్రాంగం సైతం మత విద్వేష రాజకీయాలను తలకెక్కించుకుంది. ప్రభుత్వమే మైనారిటీలమీద ప్రత్యక్షంగా దాడులకు పాల్పడుతున్న సంఘటనలు కోకొల్లలు.

ఆప్, కాంగ్రెస్ వంటి పార్టీలు ఇప్పుడు కూడా హిందూ సెంటిమెంటును ఎన్నికలలో తమకు అనుకూలంగా ఎలా ఉపయోగించుకోవాలా అన్నదానికే ప్రాధాన్యతనిస్తున్నాయి. వైసిపి, టిడిపి, జనసేన, బిజెడి మరికొన్ని ప్రాంతీయ పార్టీలు బిజెపి మతోన్మాద వైఖరి పట్ల చాలా మెతకగా వ్యవహరిస్తున్నాయి. ఈ వైఖరి దేశంలో వివిధ ప్రాంతాల్లో హిందూత్వ భావజాలం వేగంగా విస్తరించడానికి దోహదం చేస్తుంది. ముఖ్యంగా మన రాష్ట్రంలో బిజెపికి ఓట్లు లేకపోవచ్చు. కాని బిజెపి మత విద్వేష రాజకీయాలకు పాల్పడినప్పుడు గట్టిగా గొంతెత్తేవి వామపక్షాలు మినహా మరో పార్టీ లేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి మారాలంటే బిజెపిని ఎన్నికలలో ఓడించాలి. అయితే, కేవలం ఎన్నికల ఎత్తుగడలతోటే బిజెపిని ఓడించడం సాధ్యం కాదు. ఒకవేళ ఒకసారి ఎన్నికల్లో ఓడించగలిగినా దేశంలోని అన్ని పాలనాంగాలలోకీ, విద్యావ్యవస్థలోకీ చొచ్చుకుపోయిన హిందూత్వ భావజాలం అలానే విస్తరిస్తూనే వుంటుంది. ఆ భావజాలాన్ని కూడా పూర్తిగా ఓడించాల్సి ఉంది. అప్పటివరకు ఆ ప్రమాదం అలానే ఉంటుంది. అనునిత్యమూ ప్రజలను, వారి ఆలోచనలను ప్రభావితం చేస్తున్న మతతత్వ భావజాలాన్ని సైద్ధాంతికంగా, సాంస్కృతికంగా ఎదుర్కోవాలి. భారత జాతీయోద్యమ కాలంలో వెల్లువెత్తిన లౌకిక, సామ్యవాద, అభ్యుదయ భావజాల వారసత్వాన్ని ప్రగతిశీల శక్తులు స్వీకరించాలి. దానిని ఆయుధంగా చేబూని జన జీవనంలోని అన్ని పార్శ్వాలలోకీ చొచ్చుకుపోవాలి. బిజెపి హిందూ జాతీయ దురహంకార, విద్వేష, హింసాయుత రాజకీయాన్ని నిజమైన భారతీయ జాతీయతావాదం బలంతో ఎదుర్కొనాలి. కష్టజీవులను చీల్చే విద్వేషపూరిత రాజకీయాలను భిన్నత్వంలో ఏకత్వం ప్రాతిపదికన తిప్పికొట్టాలి.

భారతదేశంలో లౌకిక భావనలు, లౌకిక సాంప్రదాయాలు ఇంకా బలంగానే ఉన్నాయి. వాటన్నింటినీ ఒక దగ్గర పోగు చేయడం అవసరం. సంఘపరివార్ ఇచ్చే విద్వేష నినాదాలకు, సాగించే హింసకు దేశంలో ప్రజలనుండి వ్యతిరేకత పలు సందర్భాలలో వ్యక్తం అయింది. బాబ్రీ మసీదును కూల్చిన తర్వాతే కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వం రాజీనామా చేసింది. ఆ వెంటనే జరిగిన ఎన్నికలలో బిజెపి ఓడిపోయింది. ముంబాయిలో మతఘర్షణలు జరిగినా, అక్కడి కార్మికవర్గం, సామాన్య ప్రజలు ఎంతో లౌకికస్ఫూర్తితో వ్యవహరించారు. గుజరాత్ లో మారణహోమం జరిగినప్పుడు దేశం యావత్తూ తీవ్రంగా నిరసించింది. అయితే, ఈ లౌకిక స్పందన ఇంకా సంఘటితం కావాల్సి ఉంది. అలా జరగాలంటే దానిలో కార్మిక, కర్షక, తరగతులు, శ్రమజీవులు, లౌకిక ప్రజాస్వామ్యవాదులు కీలక పాత్ర పోషించాలి. ఇటీవల డిల్లీలో జరిగిన రైతుల పోరాటం మతోన్మాదుల కుట్రలను అన్నింటినీ తిప్పికొట్టి విజయం సాధించగలిగింది. అంతకు ముందు పరస్పరం శత్రువులుగా ఒకరినొకరు చూసుకున్న హిందూ, ముస్లిం రైతులు ఆ విద్వేషాన్ని అధిగమించి అన్నదమ్ముల్లా కలిసి పోరాడారు. ఆధిపత్య కులాలకు చెందిన రైతులు, నిమ్నకులాల రైతులు భుజం, భుజం కలిపి ఉద్యమించారు. ఈ అనుభవం మనకు బలమైన వర్గ, ప్రజా పోరాటాలను నిర్మించగలిగితే మత విద్వేష రాజకీయాలను తిప్పికొట్టడం సాధ్యమే అన్న పాఠాన్ని నేర్పుతోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ స్థితిలో కార్పొరేట్లకు మితవాద రాజకీయాల అవసరం చాలా ఎక్కువ. అందుకే కార్పొరేట్లు, వారి ఆధిపత్యం లోని మీడియా, వారి పెంపుడు జంతువుల వంటి మేధావులు మతవాద, మితవాద రాజకీయాలవైపే ఉంటారు. నయా ఉదారవాద వినిమయ తత్వం, హిందూత్వ మతోన్మాదం కలగలిసే వ్యవహరిస్తున్నాయి. అయితే, 30 సంవత్సరాల క్రితం నయా ఉదారవాద విధానాలను ప్రజానీకం అంగీకరించినట్టు ఇప్పుడు అంగీకరించడం లేదు. పైగా సంక్షోభ భారాలు వారి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. అందుచేత రానున్న రోజుల్లో ప్రజలనుండి ఈ విధానాలకు ప్రతిఘటన తప్పదు. బ్రెజిల్ లో జరిగిన పరిణామాల వంటివి ఇతర దేశాల్లో కూడా సంభవిస్తాయి. అంటే వివిధ తరగతుల, ప్రజానీకం కలిసివచ్చే అవకాశాలు పెరుగుతాయి. కార్పొరేట్ల దోపిడీకి నలిగిపోతున్న చిన్న వ్యాపారులు, కార్పొరేట్ వ్యవసాయాన్ని వ్యతిరేకించే వివిధ తరగతుల రైతాంగం, చితికిపోతున్న వృత్తిదారులు అందరూ కలిసివస్తారు. లాటిన్ అమెరికా దేశాల అనుభవాలతో అభ్యుదయ శక్తులు వీరందరితో కలిసి నడవాలి. నయా ఉదారవాద విధానాలు ప్రారంభం అయిన తొలి నాళ్ళలో రేగిన బాబ్రీ మసీదు వివాదం మతవాద, మితవాద శక్తుల ఆధిపత్యాన్ని పెంచడానికి ఉపయోగపడింది. ఇంకా ఉపయోగపడుతుంది కూడా. అందుచేత వామపక్ష, అభ్యుదయ శక్తులు గత ముప్పై ఏళ్ల అనుభవాలనూ పరిశీలించాలి. ఇప్పుడు ఆ నయా ఉదారవాద విధానాలే సంక్షోభంలో పడ్డాయి గనుక, హిందూత్వ శక్తులకు అధికారమిస్తే ఏం జరుగుతుందో ప్రజలకు స్వీయానుభవం అవుతున్నది గనుక వామపక్ష, అభ్యుదయ శక్తులు వేగంగా పుంజుకోడానికి అవకాశాలు పెరిగాయి.



పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ స్థితిలో కార్పొరేట్లకు మితవాద రాజకీయాల అవసరం చాలా ఎక్కువ. అందుకే కార్పొరేట్లు, వారి ఆధిపత్యం లోని మీడియా, వారి పెంపుడు జంతువుల వంటి మేధావులు మతవాద, మితవాద రాజకీయాలవైపే ఉంటారు. నయా ఉదారవాద వినిమయ తత్వం, హిందూత్వ మతోన్మాదం కలగలిసే వ్యవహరిస్తున్నాయి. అయితే, 30 సంవత్సరాల క్రితం నయా ఉదారవాద విధానాలను ప్రజానీకం అంగీకరించినట్టు ఇప్పుడు అంగీకరించడం లేదు. పైగా సంక్షోభ భారాలు వారి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. అందుచేత రానున్న రోజుల్లో ప్రజల నుండి ఈ విధానాలకు ప్రతిఘటన తప్పదు.

నివాళి

మతతత్వంపై రాజీపడని అంబేద్కర్



బాబ్రీ మసీదును సంఘ పరివార్ సంస్థలు విధ్వంసం చేయడంలో విషాదం మరో కోణం ఏమంటే డిసెంబరు 6 అంబేద్కర్ వర్ధంతి రోజు కావడం. ఈ దేశానికి లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడి వర్ధంతి రోజునే ఆ దురంతానికి పాల్పడ్డం సంఘ పరివార్ వాస్తవ రూపాన్ని తెలిపే మరో సందర్భం. ఈ ముప్పైఏళ్ల చరిత్రను తేరిపార చూసేప్పుడు అంబేద్కర్‌ను స్మరించుకోవడం, మతతత్వ రాజకీయాలపై ఆయన నిశిత విమర్శలను గుర్తు చేసుకోవడం అవసరం.

జీవితమంతా సామాజిక న్యాయం కోసం పరితపించిన అంబేద్కర్ హిందూత్వ రాజకీయాలను, హింద్‌రాజ్ ఏర్పాటు చేయాలనే పిలుపులను నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. వాస్తవానికి అది అగ్రవర్ణాల భావజాలమనీ వర్ణ వ్యవస్థ ద్వారా అత్యధిక ప్రజానీకాన్ని అణచివేసి దోపిడీ పీడన సాగించినట్టే అల్ప సంఖ్యాక మతాల విషయంలోనూ చేయడం వారి స్వభావమని ఆయన స్పష్టీకరించారు. ఆయన అధికార వాణిగా పరిగణించబడిన జనతా పత్రికలో తరచూ ఈ అభిప్రాయాలు ప్రకటిస్తూ వచ్చారు. బహిష్కృత్ భారత్, ప్రబుద్ధ భారత్ లలోనూ అనేక సార్లు ఈ విషయాలు రాశారు. 1934లో ఆరెస్సెస్ విషయంలో తన విమర్శ వెలువరించారు. 1940లో పాకిస్తాన్ ఆర్ పార్టిషన్ ఆఫ్ ఇండియా అన్న పుస్తకం రాస్తూ హిందూ రాష్ట్ర భావనను తోసిపుచ్చారు. హిందూత్వ రాష్ట్ర ప్రాతిపదికన దేశమే ఏర్పడేట్టయితే అంతకంటే విపత్తు మరొకటి వుండదని స్పష్టం చేశారు. అందుకే ఎట్టి పరిస్థితులలోనూ హిందూత్వ ప్రాతిపదికన ఏర్పడే రాజ్యాన్ని నిరోధించాల్సిందేనని హెచ్చరించారు. వీరసావర్కార్, మహ్మదాలీ జిన్నా ఒకే నాణేనికి బొమ్మ బొరుసు వంటి వారిని తేల్చిచెప్పారు. ఇద్దరూ మరో మతం అస్తిత్వాన్ని, హక్కును గుర్తిస్తామంటూనే దేశాన్ని రెండు చేయాలని పట్టుపట్టడం ఇందుకు నిదర్శనమన్నారు. 1950లో అంబేద్కర్ న్యాయశాఖా మంత్రి పదవికి రాజీనామా చేయడానికి కూడా ఈ హిందూత్వ శక్తులే కారణం. హిందూ కోడ్ బిల్లు మతానికి హాని చేస్తుందని వారు గగ్గోలు పెట్టడాన్ని ఆయన ఆమోదించలేదు. ఆ సమయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యాం ప్రసాద్ ముఖర్జీ వంటివారు పనికట్టుకుని దాడి చేశారు. 1956లో బౌద్ధాన్ని స్వీకరించడం లోనే అంబేద్కర్ కులదొంతరలతో కూడిన హిందూ వర్ణ వ్యవస్థను తిరస్కరిస్తూ బయటకు నడిచారు. అది ఆయన ఎంచుకున్న మార్గమైనప్పటికీ ఆయన అభిప్రాయాలు మరింత విస్తృతమైనవని గుర్తించాల్సి వుంది. మతతత్వాన్ని నిష్కర్షగా ఖండించిన వ్యక్తి ఆయన.

విచిత్రమేమంటే ఇదే అంబేద్కర్‌ను హిందూత్వ ఖాతాలో వేసుకునే ప్రయత్నాలు ఆరెస్సెస్ 1980లోనే ప్రారంభించింది. సంఘ్ స్థాపకులైన గోల్వార్కర్, సావర్కార్ వంటి వారితో ఆయనకు చాలా సాన్నిహిత్య ముందనే పాటెత్తుకుంది. ఆయన చేపట్టిన బౌద్ధం హిందూ మతంలో శాఖ తప్ప మరోటి కాదని ప్రచారం మొదలెట్టింది. 2014లో మోడీ వచ్చిన కొద్ది రోజుల్లోనే అంబేద్కర్ ఆశయాల ప్రకారమే తాము నడుస్తున్నామనే రాతలు ప్రారంభించారు. 2017లో మోడీ ఢిల్లీలో అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రం ప్రారంభించారు. అలాంటివి తర్వాత చాలా వచ్చాయి. బిజెపి పాలిత రాష్ట్రాలలో భారీ స్మారక చిహ్నాలు నిర్మిస్తున్నారు. వీటిని 2023కు పూర్తి చేస్తే ఎన్నికలకు ఉపయోగపడుతుందని లెక్కలు వేసుకుంటున్నారు. రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతి చేయడమూ అందుకోసమే నన్నారు. అసలు ఆరెస్సెస్ మరింతగా విస్తరిస్తేనే హిందూ సమాజం ఐక్యత పెరుగుతుందని అంబేద్కర్ తనతో చెప్పినట్టు దత్తోపత్ తెంగ్డే రాసుకున్నారని కొందరు విమర్శిస్తుంటారు. అంబేద్కర్ భావనలకు ఆయన రూపొందించిన రాజ్యాంగ విలువలకూ పూర్తి వ్యతిరేకంగా బాబ్రీ విధ్వంసానికి మత కలహాలకూ కారణమైన వారే ఆయనను తమకు అనుకూలుడుగా చిత్రించుకోవడం చారిత్రిక వైపరీత్యం. అటూ ఇటూ కూడా దెబ్బ తీసే చక్రబంధం వక్రవ్యూహం. దీనిపై ప్రత్యేకంగా అనేక పుస్తకాలు వెలువడ్డాయి. మతతత్వ రాజకీయాలపై పోరాటానికి ప్రతినబూనే సందర్భంలో మహనీయుడు అంబేద్కర్ నిజమైన బోధనలను అధ్యయనం చేయడం, విస్తృతంగా ప్రచారంలో పెట్టడం మరింత అవసరమవుతుంది.

– పీపీ

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కండి

- డిఎస్ఎంఎం సభలో వెంకట్

పాట్నా: మతోన్మాదానికి వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పిలుపునిచ్చారు. బెగుసరాయిలో జరుగుతున్న డిఎస్ఎంఎం అఖిలభారత మహాసభలో చివరిరోజైన సోమవారం ఆయన మాట్లాడుతూ పేదలు, దళితులు, గిరిజనులు మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్యం కావాలన్నారు. దేశంలో 90శాతంగా ఉన్న పేదలు భూమికి దూరంగా ఉన్నారని చెప్పారు. కనీస కూలి రేట్లు కూడా అమలు కాకపోవడంతో కటిక దరిద్రాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. అదే సమయంలో ఉన్న భూమిని కార్పొరేట్లు అభివృద్ధి పేరిట గుంజుకుంటున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం భూముల నుండి గిరిజనులను దూరం చేసే కుట్రకు పాల్పడుతోందని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. ప్రజల దృష్టిని విభజించి తప్పుదోవ పట్టించేందుకు ఒక పథకం ప్రకారం మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. ప్రజలను పీల్చే ఆ విధానాలకు వ్యతిరేకంగా గ్రామ స్థాయి నుంచి పోరాటాలు ప్రారంభం కావాలని, వాటిలో వ్యవసాయ కార్మిక సంఘం భాగస్వామి అవుతుందని చెప్పారు.

అన్నదాతలపై కేంద్రం బహుముఖ దాడి

- కేరళలో 13 నుంచి 16 వరకూ ఎఐకెఎస్ జాతీయ మహాసభ
- కడవెండిలో రైతు అమరవీరుల జ్యోతి యాత్ర ప్రారంభ సభలో జాతీయ సహాయ కార్యదర్శి కృష్ణప్రసాద్



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్నదాతలపై బహుముఖ దాడి చేస్తోందని ఎఐకెఎస్ జాతీయ సహాయ కార్యదర్శి, రైతు అమరవీరుల జ్యోతి యాత్ర నాయకులు కృష్ణప్రసాద్ విమర్శించారు. ప్రజలపై కేంద్రం తీవ్రమైన భారాలు మోపుతోందన్నారు. దేశంలో ఆహార ధాన్యపు నిల్వలు ఉన్నా, అన్నార్తులకు ఆహారం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జరుగనున్న ఎఐకెఎస్ జాతీయ మహాసభలను పురస్కరించుకుని దొడ్డి కొమురయ్య స్వగ్రామం జనగాం జిల్లా కడవెండి గ్రామం నుంచి రైతు అమరవీరుల జ్యోతి యాత్ర సోమవారం ప్రారంభమైంది. అమరవీరుల జ్యోతిని ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి వెలిగించి ఈ యాత్రను ప్రారంభించారు. అంతకు ముందుకు దొడ్డి కొమురయ్య స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై కేంద్రంపై సమరశీల పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూ సమస్యను ఎజెండాగా మార్చడమే కాకుండా ప్రపంచ విప్లవ కార్యక్రమాలకు మూల కేంద్రమైందని తెలిపారు. నిజాం పాలనలో అణచివేత, దోపిడీ, వెట్టిచాకిరి వంటి విధానాలకు వ్యతిరేకంగా కుల, మత తేడాలు లేకుండా ప్రజలు ఐక్యంగా పోరాడారని గుర్తు చేశారు. ఆ పోరాటం ముస్లిం రాజుకు వ్యతిరేకంగా జరిగిందంటూ బిజెపి, సంఘపరివార్ శక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. అమరవీరుల స్ఫూర్తిని రగిల్చేందుకే కడవెండి గ్రామం నుంచి జ్యోతి యాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. దేశంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అన్ని పంటలకూ మద్దతు ధరల చట్టం కోసం పోరాడాలని అన్నారు. భూములు, మార్కెట్లు, గోదాములను కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ సర్కారు మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. ఏడాదిన్నర కాలంపాటు పోరాటం, 750 మంది రైతుల బలిదానం ఫలితంగా కేంద్రం ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటున్నదన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యాత్ర డిప్యూటీ నాయకులు టి.సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, మార్కెట్లు అందుబాటులోకి లేకుండా చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, రైతు అమరవీరుల జ్యోతి యాత్ర మేనేజర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. కడవెండిలో ప్రారంభమైన ఈ యాత్ర వెంకిర్యాల, గుండ్రాంపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది.



సిడిని ఆవిష్కరిస్తున్న అశోక్‌తేజ, విప్లవకుమార్, యోచన,విజయకుమార్,

చైతన్యం కలిగించేదే పాట

- ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ
- ఎస్ఎఫ్ఐ 'త్యాగపు ఆర్గాన్ పాటల సిడి' ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులను, ప్రజలను పిడికిళ్లు బిగింపజేసేలా, చైతన్యం కలిగించేలా చేసేదే పాట అని ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. విప్లవ సాహిత్యానికి సౌందర్యాత్మకమైన భావోద్వేగాన్ని రగిలించాలనీ, అందుకు తగ్గ పదాలను ఆ పాటలో జోడించాలని సూచించారు. ఏ అంశంపై పాట రాస్తున్నామో దాన్ని ఇష్టపడితే వచ్చే స్పందన, ఫలితం అద్భుతంగా ఉంటాయని చెప్పారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 17వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'త్యాగపు ఆర్గాన్' అనే పాటల సిడిని ఆయన ఆవిష్కరించారు. అశోక్‌తేజ మాట్లాడుతూ.. పాట పల్లవి గెరిల్లా ముట్టడి లాగా ఉండాలని సూచించారు. తనకు చిన్నప్పటి నుంచే ఎస్ఎఫ్ఐతో అనుబంధం ఉందన్నారు. 'నేను లెఫ్ట్ అయ్యాను. కానీ నా భావజాలం, నా కంఠం, పెన్నులో నుంచి లెఫ్ట్... లెఫ్ట్ కాలేదు.'అని చెప్పారు. తన ఎదుగుదలకు సుద్దాల హనుమంతు, జానకమ్మ కారణమని అన్నారు. పాటలు రాసిన ఎం విప్లవకుమార్, యోచన, ఎ విజయకుమార్, సంగీతం అందించిన రవి కల్యాణ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, రచయిత ఎం విప్లవకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి, రచయిత ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉత్సాహం, ఉత్తేజాన్ని నింపడం కోసమే తాను ఈ పాట రాశానని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి అధ్యక్షత వహించారు.

స్వేచ్ఛ, సమానత్వం ప్రాతిపదికగా వైవిధ్యతను ఆమోదించాలి

(మొదటి పేజీ తరువాయి)

సంక్షోభం భారాన్ని పంచుకోవడానికి సంపన్న దేశాలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలోకి ప్రవేశించనప్పుడు జి-7, జి-20గా విస్తరించిందని గుర్తు చేశారు. 2008లో ప్రపంచ ఆర్థిక మాంద్యం తరువాత ప్రారంభ మంత్రుల స్థాయి సంప్రదింపులు ప్రభుత్వ సమ్మిట్‌ల అధిపతులుగా మార్చబడ్డాయని, అప్పటి నుండి దేశీయ ఆర్థిక వ్యవస్థ, సామాజిక, రాజకీయ పరిస్థితులతో పెద్దగా సంబంధం లేని రొటేషన్ అధ్యక్ష పద్ధతిని అవలంబిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ 'ఒక ప్రపంచం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' అనే థీమ్ చుట్టూ దేశీయ రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని ప్రకటించారని, భారతదేశం జి-20 ప్రెసిడెన్సీ ఏకత్వం సార్వత్రిక భావాన్ని ప్రోత్సహించడానికి పని చేస్తుందని అన్నారని ఏచూరి తెలిపారు. అయితే ఈ లక్ష్యాలను చేరుకోవడానికి లక్ష్య సాధన దిశగా పని చేయాలని సూచించారు. వసుధైక కుటుంబం అనే భావన అంటే ఏకరూపతను బలవంతంగా రుద్దడం కాదని, అన్ని వైవిధ్యాలను సమానత్వం, గౌరవం ఆధారంగా పరిగణించడంతో సామాజిక బహుళత్వాలు జరుపుకునే ప్రపంచ కుటుంబానికి గుర్తింపు అని తెలిపారు. అటువంటి ప్రపంచ కుటుంబం ప్రతి దేశంలో దేశీయంగా స్థాపించబడిన అటువంటి సమాజాలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. "ప్రధాని మోడీ ప్రకటించిన లక్ష్యం కులం, మతం, లింగంతో సంబంధం లేకుండా రాజ్యాంగం ప్రకటించినట్లుగా అందరికీ సమానత్వంపై ఆధారపడిన సమాజం, రాజకీయ నిర్మాణాన్ని సృష్టించడంపై ఉండాలి. ఇది పౌరులందరికీ న్యాయం సామాజిక, రాజకీయ, ఆర్థిక పంపిణీపై ఆధారపడి ఉంటుంది" అని తెలిపారు. "ద్వేషం, భీభత్సం, హింస వంటి దుర్మార్గపు ప్రచారాల ఆధారంగా మతపరమైన ధ్రువీకరణ ప్రస్తుత ప్రమాదకర స్థాయిలు ప్రధాని మోడీ ప్రకటించిన వాటి పునాదులను నాశనం చేస్తున్నాయి. భయంకరంగా పెరుగుతున్న నిరుద్యోగం,పేదరికంతో ఆర్థిక మందగమనం అదమస్థాయికి పడిపోతోంది. మహిళలు, దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై సామాజిక అన్యాయాలు పెరిగిపోతున్నాయి. అసమ్మతి వ్యక్తీకరణలన్నింటినీ 'జాతీయ వ్యతిరేకం'గా పరిగణించడంతో ప్రజాస్వామ్య హక్కులు, పౌర స్వేచ్ఛలకు సంబంధించిన రాజ్యాంగ హామీలు తీవ్రంగా పరిమితం చేయబడ్డాయి" అని తెలిపారు. జి 20 అధ్యక్షురాలిగా ఈ ప్రకటిత భారత్ లక్ష్యాలను ప్రపంచం గుర్తించాలంటే, ఈ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

ముగిసిన రెండో దశ

- 93 స్థానాలు.. 58 శాతం ఓటింగ్
- గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు పరిసమాప్తం

అహ్మదాబాద్ : గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చివరిదైన రెండో దశ కొన్ని అవాంఛనీయ ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఈ దశలో మొత్తం 93 స్థానాలకు పోలింగ్ జరిగింది. సాయంత్రం ఐదు గంటల వరకు 58 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, ఆప్ సహా మొత్తం 61 మంది పార్టీల నుంచి మొత్తం 833 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈనెల 8న వెల్లడి కానున్నాయి. ప్రధాని మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, గుజరాత్ ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి ఇసుదన్ గధ్వి, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు సుఖ్రమ్ రత్వా లు ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖుల్లో ఉన్నారు. అహ్మదాబాద్‌లోని రానిప్‌లో గల నిషాన్ పబ్లిక్ స్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం ఎన్నికల కమిషన్‌ను మోడీ అభినందించారు. ఆప్ సీఎం అభ్యర్థి ఇసుదన్ గధ్వి అహ్మదాబాద్‌లోని ఒక పోలింగ్ స్టేషన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవటానికి వెళ్తూ ప్రధాని మోడీ రెండున్నర గంటలు రోడ్ షో నిర్వహించటంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా తెలిపారు. తమ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని మెహ్సానా జిల్లాలోని నాలుగు గ్రామాలు ఎన్నికలను బహిష్కరించాయి.

హిమాచల్‌లో హోరాహోరీ

- గుజరాత్‌లో బిజెపి
- ఎగ్జిట్‌పోల్స్ అంచనా

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండోదశ కూడా పూర్తికావడంతో సోమవారం సాయంత్రం నుంచి ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వెల్లడవుతున్నాయి. గుజరాత్‌లో మళ్లీ బిజెపి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి, కాంగ్రెస్ మధ్య పోటాపోటీగా ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అజ్‌తక్-యాక్సిస్ మై ఇండియా, టివి 9 గుజరాత్, న్యూస్ ఎక్స్ జాన్ కి బాత్, ఇండియా టివి వంటి ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేశాయి. 182 మంది సభ్యులున్న గుజరాత్ అసెంబ్లీలో బిజెపికి 120 నుంచి 140 వరకూ స్థానాలు, కాంగ్రెస్‌కు 30 నుంచి 50 స్థానాలు, ఆప్‌కు 15 వరకూ స్థానాలు వచ్చే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. 68 అసెంబ్లీ సీట్లు ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపికి 30 నుంచి 40 స్థానాలు, కాంగ్రెస్‌కు 25 నుంచి 30 స్థానాలు, ఆప్‌కు 10 వరకూ స్థానాలు వచ్చే అవకాశం ఉందని ఈ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపిపై ఆప్ ఘన విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌కు నవంబర్ 12న, గుజరాత్‌లో ఈ నెల 1, 5వ తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నెల 8న ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు.

గవర్నర్ వ్యవస్థ రద్దు చేయాలి

- 29న సిపిఐ దేశవ్యాప్త ఆందోళన : డి. రాజా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని, సమాఖ్య వ్యవస్థను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను సోమవారం నాడిక్కడ సిపిఐ ప్రధాన కార్యాలయం (అజయ్ భవన్)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. అక్టోబర్‌లో విజయవాడలో విజయవంతంగా జరిగిన 24వ పార్టీ అఖిల భారత మహాసభను కార్యవర్గం సమీక్షించిందని అన్నారు. కొత్తగా ఎన్నికైన జాతీయ కార్యవర్గ సభ్యులకు బాధ్యతలను అప్పగించామని తెలిపారు. ఫెడరలిజం పరిరక్షణ, గవర్నర్ వ్యవస్థ రద్దు చేయాలని ప్రచార కార్యక్రమం నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు. దేశ సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకు ప్రజాతంత్ర శక్తులు ఏకతాటిపైకి రావాలని కార్యవర్గం పిలుపునిచ్చిందని తెలిపారు.

రాజ్యాంగ పునాదులను దెబ్బతీసేందుకు, ఆర్ఎస్ఎస్ కేంద్రీకరణ భావజాలంతో మార్గనిర్దేశం చేస్తూ గవర్నర్ కార్యాలయాలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లు బిజెపి క్యాంపు కార్యాలయాలుగా పని చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 29న 'డిఫెండ్ ఫెడరలిజం డే'గా పాటించాలని దేశవ్యాప్తంగా సిపిఐ అన్ని యూనిట్లకు జాతీయ కార్యవర్గం పిలుపునిచ్చిందని తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ రాజ్యసభ ఎంపి బినయ్ విశ్వం, జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొన్నారు.

అసెంబ్లీ కార్యకలాపాలకు మహిళా ప్యానెల్

- కేరళ చరిత్రలోనే ఇది తొలిసారి

తిరువనంతపురం : కేరళ శాసనసభ చరిత్రలోనే మొదటిసారిగా, అందరూ మహిళా సభ్యులే వున్న కమిటీ శాసనసభ కార్యకలాపాలను నిర్వహించనుంది. అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లు లేని సమయంలో ఈ కమిటీ సభా కార్యకలాపాలు చేపట్టనుంది. స్పీకర్ ఎ.ఎన్.షమీర్ ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా ముగ్గురు సభ్యులు గల ఈ కమిటీలో ఒకరు మాత్రమే మహిళ వుంటారు. ఈసారి ముగ్గురూ మహిళలే వుంటున్నారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్న వెంటనే పాలక వామపక్ష సంఘటన రెండు పేర్లను సూచించింది. ప్రతిపక్ష యుడిఎఫ్ మరో పేరును సూచించింది. త్రిసభ్య కమిటీలో ఆశా సి.కె. (సిపిఐ), ప్రతిభ (సిపిఎం), యుడిఎఫ్ మిత్రపక్షమైన రివల్యూషనరీ మార్క్సిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాకి చెందిన కెకె రేమా సభ్యులుగా వున్నారు. కేరళ తొలి అసెంబ్లీ నుంచి ప్రస్తుత అసెంబ్లీ 7వ సమావేశాల వరకు మొత్తంగా 515మంది సభ్యులు ఈ కమిటీలో వుండగా, వారిలో 32మంది మాత్రమే మహిళలు. సభలో కాంగ్రెస్ ఎంఎల్ఎ ఉమా థామస్ వున్నప్పటికీ యుడిఎఫ్ రేమా పేరును సూచించడం గమనార్హం.

సురక్షితంగా తిరిగివచ్చిన చైనా వ్యోమగాములు

బీజింగ్ : చైనా రోదసీ స్టేషన్‌లో ఆరు మాసాల పాటు గడిపిన ముగ్గురు వ్యోమగాములు ఆదివారం తమ పర్యటన ముగించుకుని భూమికి తిరిగి వచ్చారు. ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియా స్వయంప్రతిపత్తి ప్రాంతంలో గల గోబి ఎడారిలోని డాంగ్‌ఫెంగ్ ల్యాండింగ్ సైట్‌లో షెంఝూ-14 అంతరిక్ష నౌక సురక్షితంగా దిగింది. షెంఝూ-14 సిబ్బంది భూమికి తిరిగి రావడానికి ముందుగా గ్రౌండ్ టీమ్ సాయంతో షెంఝూ-15 సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. ప్రాయోగిక డేటాను డౌన్‌లోడ్ చేయడంతో సహా పలు బాధ్యతలు ఇందులో వున్నాయి. ముగ్గురు వ్యోమగాముల శరీరాల్లోని ద్రవాలు అంటే రక్తం, మూత్రం, లాలాజలం సహా ఇతర నమూనాలను కూడా మెడికల్ సైన్సెస్ బృందం తీసుకోనుంది.

'జి-20'కి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించుకుంటారని తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. వివిధ రంగాలకు సంబంధించిన జి-20 సమావేశాలను నిర్వహించడంలో తమిళనాడు తన పూర్తి మద్దతు, సహకారాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), మమతా బెనర్జీ (టిఎంసి), నవీన్ పట్నాయక్ (బిజెడి), ప్రేమ్‌సింగ్ తమాంగ్ (ఎస్‌కెఎం), ఏక్‌నాథ్ షిండే (శివసేన-షిండే), జోరంతంగా (ఎంఎన్ఎఫ్), పలనిస్వామి (అన్నాడిఎంకె), కె.ఎం. కాదర్ మొహిదీన్ (ఐయుఎంఎల్), పసుపతి కుమార్ పారస్ (ఆర్‌ఎల్‌జెపి), రాందాస్ అథ్వాలే (ఆర్‌పిఐ), హనుమాన్ బెనివాల్ (ఆర్‌ఎల్‌పి), కెఎం మణి (కెసి), తిరుమవలన్ (విసికె), హెూం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, కార్మిక శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు.

ఈ పార్టీలు గైర్హాజరు

అఖిలపక్ష సమావేశానికి దాదాపు పది పార్టీల వరకు గైర్హాజరు అయ్యాయి. టిఆర్ఎస్, ఎన్‌సిపి, ఎస్‌పి, బిఎస్‌పి, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్‌జెడి, జెడియు, శివసేన (ఠాక్రే), ఆర్ఎస్‌పి, ఎంఐఎం, అప్నాదల్, ఎస్ఎడి, ఎఐయుడిఎఫ్, జెఎంఎం తదితర పార్టీలు హాజరు కానట్లు సమాచారం.



మీకోసం

సాంబారు మరుగుతున్నప్పుడు ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

జీవితంలో అన్నీ కోల్పోయినా భవిష్యత్తు మాత్రం మిగిలే వుంటుంది. దానిని జాగ్రత్తగా నిర్మించుకోవాలి.

రాజ్యాంగ రచయిత అంబేద్కర్



పిల్లలూ, ఈ రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్థంతి. ఈ సందర్భంగా ఆయన గురించి కొన్ని విషయాలను తెలుసుకుందామా!

అంబేద్కర్ అసలు పేరు భీంరావ్ రాంజీ అంబేద్కర్. 1891, ఏప్రిల్ 14న అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన 'మౌ' అన్న ఊరిలో (ఇప్పటి మధ్యప్రదేశ్‌లో) రాంజీ మలోజీ సాక్పాల్, భీమాబాయ్ దంపతులకు 14వ సంతానంగా జన్మించారు. ఈయన ఆరేళ్ళ వయసులోనే తల్లి చనిపోయింది. తోబుట్టువుల్లో తొమ్మిది మంది మృత్యువాత పడగా ఇద్దరు అక్కలు, ఇద్దరు అన్నలు మిగిలారు.

అంబేద్కర్ చిన్నతంలోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నారు. తనను వేరే పిల్లలతో కలవకుండా, మాట్లాడకుండా పాఠశాల గదిలో ఒక మూల కూర్చోబెట్టేవారు. నీళ్ళు తాగాలంటే ప్యూన్ వచ్చి ఇచ్చేవాడు. నేరుగా తీసుకొని తాగకూడదట. ప్యూన్ లేకపోతే నీళ్ళు తాగే అవకాశం వుండేది కాదు. ఈ దుస్థితిని అంబేద్కర్ క్లుప్తంగా 'ప్యూన్ లేడు కనుక నీళ్ళు లేవు' అని తోటి పిల్లలకు వివరించాడు.

బి.ఏ. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పై చదువులు చదవాలన్న పట్టుదల వల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపారు. విదేశాల్లో చదువు పూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్ళు పనిచేసే షరతుపై ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరారు. రెండేళ్లలో ఎం.ఎ., పి.హెచ్.డి. పట్టాలను పొందారు. పదేళ్ళ తర్వాత 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియా అనే పేరుతో సిద్ధాంత వ్యాసాన్ని ప్రచురించారు. చదువు పూర్తి చేసి డాక్టర్ అంబేద్కర్‌గా స్వదేశం వచ్చారు. ఒక దళితుడు అంత గొప్ప పేరు సంపాదించుకోవటం ఆనాటి పెత్తందారులకు ఆశ్చర్యం కల్గించింది.

తరువాత కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుంచి డి.ఎస్.సి (డాక్టరేట్) పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాల్లో పరిశోధనలు చేశారు. మొదట్లో న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా పని చేశారు. తరువాత భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల సామాజిక రాజకీయ హక్కులు కృషి చేశారు. భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం రాజ్యాంగ పరిషత్తు సభ్యుడిగా అంబేద్కర్ బాధ్యత వహించారు. రాజ్యాంగ రచనా సంఘంలో నియమితులైన ఏడుగురూ వేర్వేరు పనుల్లో ఉండటంతో రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. తరువాత న్యాయశాఖ మంత్రిగా కొంతకాలం పనిచేసి, 1951 అక్టోబరులో ఆ పదవికి రాజీనామా చేశారు. 1956 డిసెంబరు 6న ఆయన మరణించారు. భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ఆయన మరణాంతరం ప్రకటించింది.

నేను గీసిన బొమ్మ





- ఎస్. తరుణ్ ఆదిత్య రెడ్డి,
4వ తరగతి,
శ్రీ కృష్ణా విద్యా మందిర్,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రెండు చక్రాలపై వేల కిలోమీటర్లు..

ఏదైనా అంశంపై అభిరుచి, ఆసక్తి ఉంటే అది నెరవేర్చుకునేందుకు వయసు అడ్డంకి కాదు. అలా చిన్నప్పుడు సైకిల్ ప్రయాణంపై మక్కువ పెంచుకున్న సంజయ్ మైయూర్ రాష్ట్రాలను దాటి దేశాలకు ప్రయాణించేస్తున్నారు. ఒక లక్ష్యం పెట్టుకోవడం అది నెరవేరేదాకా కఠోరశ్రమ చేయడం ఆయనకి అలవాటు. అందుకే 68 ఏళ్ల వయసులో కూడా చాలా వేగంగా అవలీలగా సైకిల్ తొక్కేస్తున్నారు. పైగా 30 కేజీల లగేజీతో యాత్ర చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన ఇటీవల విజయవాడ వచ్చారు.







మహారాష్ట్ర బుల్దానా గ్రామ వాసి అయిన సంజయ్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేశారు. ఆ గ్రామానికి 50 కిలోమీటర్ల దూరంలోనే అజంతా, ఎల్లోరా గుహలున్నాయి. అవి చూసేందుకు వచ్చే యాత్రికులకు ఉచితంగా భోజన సదుపాయాలు పెట్టేందుకు ప్రతి రోజూ సైకిల్ తొక్కుకుంటూ వెళ్లేవారు సంజయ్. అప్పుడే సైకిల్‌పై రాష్ట్రాలు, దేశాలు చుట్టేయాలని దృఢంగా అనుకున్నారు. అనుకున్నదే తడవు ఆనాటి నుండి ఇప్పటివరకు యాత్ర కొనసాగిస్తున్నారు. అతని విజయ యాత్రలలో 2004లో ఏథేన్స్ ఒలింపిక్స్ కీలకమైంది. అందులో పాల్గొనే భారతీయ ఒలింపియన్లు ప్రోత్సహించేందుకు 17 దేశాలలో 15 వేల కిలోమీటర్లు ప్రయాణించి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఆ సాహసం అతనికి 'కింగ్ ఆఫ్ ఘాట్స్'గా కీర్తి తెచ్చిపెట్టింది. ఈ ఏడాదిలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 4000 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. ప్రతి ఏడాది పెట్టుకున్న లక్ష్యం నెరవేరే వరకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. 'రాష్ట్రాల మధ్య శాంతి నెలకొల్పడం, శారీరక దారుఢ్యం, పర్యావరణ రక్షణ, పర్యాటక అవగాహన లక్ష్యంగా ఆయన యాత్ర కొనసాగుతుంటుంది.

విజయవాడ వచ్చిన సంజయ్‌కు భవానీద్వీపంలో ఘనస్వాగతం లభించింది. ఆ సందర్భంగా 'నేను ఈ ప్రాంతంవాడినైతే ఈ ద్వీపంలోనే ఉండిపోయేవాడిని. రోజూ ఇక్కడే సైకిల్ తొక్కుకునేవాడిని' అని అన్నారు.




ఈ మాటలను బట్టి ఎక్కడికి వెళ్లినా సైకిల్ ప్రయాణమే ఆయన ధ్యేయంగా కనపడుతోంది.

ఈ వయసులో ఇంత ప్రయాసపడి సైకిల్ తొక్కడం ఎందుకని ఎవరైనా ప్రశ్నిస్తే 'చిన్నప్పటి నుంచి సైకిల్ తొక్కడం నాకు ఇష్టం. అభిరుచిని కొనసాగించేందుకు వయసు అడ్డంకి కాదు. పైగా సైకిల్ తొక్కడం వల్ల నేను ఈ వయసులో కూడా ఆరోగ్యంగా ఉన్నాను' అంటారు.

యాత్ర కొనసాగించేందుకు ఆస్తులు అమ్ముకున్న సంజయ్ ఎప్పుడూ వాటి గురించి బాధపడలేదు. 1970 నుంచి నిర్విరామ సైకిల్ యాత్ర చేస్తున్న సంజయ్ విజయాలలో ఎన్నో మైలురాళ్లు.. చేదు అనుభవాలు ఉన్నాయి.

అవాక్కు చేసే మాయాజాలం



తన అన్నయ్య పుట్టిన రెండేళ్లకు శీతల్ పుట్టింది. పుట్టుకతోనే మూగ, చెవిటి. అదే లోపంతో పుట్టిన అన్నయ్య ఎంతోకాలం బతకలేదు. దీంతో అమ్మానాన్న శీతల్‌పై ఎంతో శ్రద్ధ పెట్టారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్కూల్లో చేర్పించారు. కాని అక్కడ సమగ్రమైన విద్య అందలేదు. సంకేత భాష నేర్చుకోకుండా తన చదువు ఎలా కొనసాగుతుంది? ఈ విషయంలో శీతల్ తల్లి ఎంతో కష్టపడింది. కూతురి విద్యా వికాసాల కోసం ఎంతో తపన పడింది..

డిగ్రీ అర్హత ఉన్నా వినపడని, మాట్లాడని శీతల్‌కు ఉద్యోగం ఎవరిస్తారు? సంకేత భాష పరిజ్ఞానం అంతగా లేని 2000వ సంవత్సరంలో శీతల్ రకరకాల ఉద్యోగాలు చేసినా ఎక్కడా రాణించలేకపోయింది. అప్పుడే తన స్వస్థలం నాగపూర్‌లో ఒక మహిళ నిర్వహిస్తున్న 'మ్యాజిక్ షో' చూసింది. ఆ షో శీతల్ ఆలోచనలను పూర్తిగా మార్చేసింది. తన తక్షణ మార్గమేంటో అర్థమైంది. ప్రముఖ ఇంద్రజాలకుడు గోఖలే దగ్గర శిక్షణ తీసుకుని తాను కూడా మ్యాజిక్ షోలు చేయాలని నిశ్చయించుకుంది.

పదేళ్లలో వందల ప్రదర్శనలు ఇచ్చిన శీతల్ ప్రతిభకు ఎన్నో బహుమతులు, ప్రశంసలు వచ్చాయి. 2014లో చికాగోలో నిర్వహించిన ప్రపంచ బధిర ఇంద్రజాల పోటీల్లో రెండవ స్థానం దక్కించుకుంది. 'ఆ అనుభవం నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి' అంటుంది శీతల్.

తన తొలి ప్రదర్శన గురించి మాట్లాడుతూ 'ఆగష్టు 15, 2000వ సంవత్సరంలో నా తొలి ప్రదర్శన ఇచ్చాను. అక్కడ లక్షలాది ప్రేక్షకులు ఉన్నారు. వారిలో నాలాంటి వారు కూడా ఉన్నారు. అంతమందిలో ప్రదర్శన ఇస్తున్నందుకు నేనేమీ ఒత్తిడికి గురవ్వలేదు. నేనెంటో.. నాలాంటి వారు ఏం సాధించగలరో ఈ ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప అవకాశంగా భావించాను. అందుకే ఆ తేదీని ఎప్పటికీ నా జీవితంలో మర్చిపోలేను' అంటూ గత అనుభవాన్ని గుర్తుచేసుకుంటుంది. ఇంకా 'నా ప్రయాణం అంత సులభంగా జరగలేదు. నా లోపం ఒక్కటే కారణం కాదు. పురుషులు అధికంగా ఉండే ఈ వృత్తిలో ఆడపిల్లనవ్వడం వల్ల నాకు అవకాశాలివ్వడానికి ఎవ్వరూ ముందుకువచ్చేవారు కాదు. నేను ఈ స్థానంలోకి వస్తానని ఎవ్వరూ ఊహించలేదు.

సమాజంలో అనాదిగా వేళ్లూనుకున్న ఈ ధోరణిని మార్చేందుకు వైకల్యం వున్న మహిళలకు ఇంద్రజాలం నేర్పించాలనుకుంటున్నాను. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే ధైర్యం వచ్చినప్పుడు బాధితులుగా భావిస్తున్న వారంతా తమపై నమ్మకం పెంచుకుంటారు' అంటూ తన భవిష్యత్తు ప్రణాళికల గురించి చెబుతారు. ప్రస్తుతం శీతల్ మెజీషియన్‌గా కాక భార్యగా, తల్లిగా, డ్యాన్సర్‌గా, నటిగా కూడా రాణించడం ఎంతోమందికి గొప్ప ఆదర్శం.

20 దేశాల్లో పుష్ప-2..!



రష్యాలో పుష్ప సినిమా విడుదల చేసేందుకు దర్శకుడు సుకుమార్ అక్కడ ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నాడు. ఈ సమయంలోనే పుష్ప 2కు సంబంధించిన చర్చలు, ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా జరుగుతోంది. ఇప్పటికే ఒక చిన్న షెడ్యూల్‌ను ముగించిన సుకుమార్ రష్యా నుండి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో షూటింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. పుష్ప 2 సినిమాను పాన్ ఇండియా మూవీగా కాకుండా పాన్ వరల్డ్ మూవీ అన్నట్లుగా విడుదల చేయాలని సుకుమార్ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. పుష్ప 2 సినిమాను ఒకే సారి 20 దేశాల్లో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా దేశాల భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేయనుండగా మరి కొన్ని దేశాల్లో సబ్ టైటిల్స్‌తో రిలీజ్ చేసే ఆలోచనల్లో ఉన్నట్లు సమాచారం.

ఆ ప్రాజెక్టు ఆగిపోయింది..



దర్శకుడు బాల, సూర్య కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అచలుడు (తమిళంలో వనంగాన్)' అర్ధంతరంగా ఆగిపోయింది. పరస్పర అంగీకారంతోనే ఈ ప్రాజెక్టు నుండి సూర్య తప్పుకుంటున్నట్లు డైరెక్టర్ బాల వెల్లడించారు. ఈ కథలో కొన్ని మార్పులు చేసినందున సూర్యకు ఆ పాత్ర సరిపోదని అన్నారు. కథపై ఉన్న నమ్మకంతోనే సూర్య ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారని.. అతనికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. త్వరలోనే మరో కొత్త హీరోతో ఈ సినిమాను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అయితే ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే దాదాపు 40 శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన నంద, శివపుత్రుడు చిత్రాలు పలు ప్రశంసలు అందుకున్నాయి.

జపాన్ షూ'టౌట్'



క్రొయేషియా చేతిలో 4-1గోల్స్ తేడాతో ఓటమి

దోహా: ఫిఫా ప్రపంచకప్ 2022 క్వార్టర్‌ఫైనల్లోకి క్రొయేషియా జట్టు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తొలి ప్రి క్వార్టర్స్ మ్యాచ్‌లో క్రొయేషియా జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 4-1గోల్స్ తేడాతో పరాజయాన్ని చవిచూసింది. రెండు అర్ధభాగాల నిర్ణీత సమయం ముగిసే సమయానికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. దీంతో 30 నిమిషాల అదనపు సమయం కేటాయించగా.. ఆ సమయంలోనూ ఇరుజట్లు మరో గోల్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో ఫలితం కోసం పెనాల్టీలను కేటాయించగా.. తొలి రెండు పెనాల్టీలను జపాన్ ఆటగాళ్లు గోల్స్‌గా మలచడంలో విఫలమ య్యారు. మూడో పెనాల్టీని గోల్‌గా మలిచినా.. మళ్లీ నాల్గో పెనాల్టీ షూటౌట్‌ను గోల్‌గా మలచడంలో ఆ జట్టు విఫలమైంది. ఇక క్రొయేషియా తరపున తొలి రెండు పెనాల్టీలు గోల్స్ కాగా.. మూడోది గోల్ అవ్వలేదు. నాల్గో పెనాల్టీని గోల్‌గా మలచడంలో ఆ జట్టు 4-1 ఆధిక్యతతో మ్యాచ్ ను గెలిచింది. బ్రెజిల్- దక్షిణ కొరియా జట్ల మధ్య జరిగే మరో ప్రి క్వార్టర్స్ విజేతతో క్రొయేషియా జట్టు క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది.

సెనెగల్‌పై ఇంగ్లండ్ గెలుపు

ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లండ్‌జట్టు 3-0గోల్స్ తేడాతో సెనెగల్‌ను ఓడించింది. ఇంగ్లండ్ జట్టు తొలి అర్ధభాగంలో రెండు గోల్స్ కొట్టగా.. రెండో అర్ధభాగంలో మరో గోల్ కొట్టింది. జోర్డాన్(38వ ని.), హ్యారీ కేన్(45+3వ ని.), బుకాయో(57వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. సెనెగల్ తరపున ఓ ఆటగాడు ఎల్లోకార్డుకు గురయ్యాడు. మొత్తమ్మీద సెనెగల్ జట్టు టార్గెట్ షాట్స్ ఒక్కటి మాత్రమే కొట్టగా.. ఇంగ్లండ్ జట్టు 4సార్లు గోల్ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 3 గోల్స్ కొట్టడం విశేషం. ఆదివారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో ఇంగ్లండ్ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్ జట్టుతో తలపడనుంది.

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు..

ప్రి క్వార్టర్‌ఫైనల్స్

మొరాకో × స్పెయిన్(రా.8.30గం॥లకు)

పోర్చుగల్ × స్విట్జర్లాండ్(రా.12.30గం॥లకు)

ఓడీ తెచ్చినా జీతాల్లేవ్ ఇప్పటి దాకా సగం మందికే ..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆరో తేదీ వచ్చేసింది... అయినా ఇంకా అందరికీ జీతాలు పడలేదు. జీతాలు, పింఛన్ల కోసం తొలి రోజునే 1931 కోట్ల రూపాయలను ఓవర్‌డ్రాఫ్ట్‌గా తెచ్చారు. అయితే ఇది ఏ మూలకూ చాలకపోవడంతో రిజర్వ్‌బ్యాంకు నుంచి కూడా రుణం తీసుకునేందుకు ప్రయత్నించారు. అయితే వార్షిక రుణ పరిమితి అడ్డంకిగా మారడంతో ఈ నెల ఇంకా సెక్యూరిటీ వేలం ద్వారా రుణం తీసుకోవడం సాధ్యం కాలేదు. అందుకే నిధుల సమస్య తలెత్తడంతో చాలామందికి జీతాలు రాలేదని అంటున్నారు. ఈ నెల తొలి రోజుల్లో అవసరమైన నిధులు అందుబాటులో లేకపోవడం వల్ల సగం మందికి మాత్రమే జీతాల చెల్లింపులు జరిగాయని చెబుతున్నారు. మొత్తం బిల్లులను ఖజానా శాఖ ఆమోదించి ఆర్థికశాఖకు, సిఎఫ్‌ఎంఎస్‌కు పంపించగా, ఆ బిల్లుల్లో అనేకం సిఎఫ్‌ఎంఎస్ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులకు జీతాల చెల్లింపులు జరుగుతున్నప్పటికీ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఇంకా జీతాలకు ఇబ్బందులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో నాలుగు రోజుల్లో రిజర్వ్‌బ్యాంకు నుంచి సెక్యూరిటీ వేలం ద్వారా కొంత రుణాన్ని తీసుకోవడం, పన్నుల రూపేణా ఖజానాకు చేరే ఆదాయం నిధులను వినియోగించి, త్వరలోనే జీతాలు, పింఛన్ల చెల్లింపులను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎమ్మెల్సీపై హత్య కేసు చార్జిషీటు ఇవ్వండి : హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌పై దాఖలైన చార్జిషీట్ కాపీని తమకు అందజేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. లోయర్ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్ కాపీని పరిశీలిస్తామని, అదేవిధంగా ఉదయ్ భాస్కర్ వాదనలు విన్న తర్వాతే ఈ కేసును సిబిఐకి ఇవ్వాలో లేదో తేల్చుతామని స్పష్టం చేసింది. నిందితుడి వాదనలు వినాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు చెప్పి ఉంటే ఆ ఉత్తర్వుల ప్రతిని పిటిషనర్ అందజేయాలని కోరింది. తన కొడుకు సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తు సజావుగా సాగడం లేదని, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్‌పై నమోదైన కేసును సిబిఐకి బదిలీ చేయాలని మతుడి తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ దాఖలు చేసిన రిట్‌ను సోమవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు విచారణ చేపట్టారు. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేశారు. అనంత అధికార వైసీపీ ఎమ్మెల్సీ కావడం వల్ల దర్యాప్తు మందకొడిగా సాగుతోందని, నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడం లేదని పిటిషనర్ తరపు లాయర్ జె. శ్రవణ్‌కుమార్ వాదించారు. ఈ వాదనను ప్రభుత్వ ప్లీడర్ పి.మహేశ్వరరెడ్డి వ్యతిరేకించారు. పోలీసుల దర్యాప్తు సక్రమంగానే జరుగుతోందన్నారు. వాదనలపై స్పందించిన హైకోర్టు, ఈ వ్యాజ్యంలో అనంత ఉదయ్ భాస్కర్‌ను ఎందుకు ప్రతివాదిగా చేయలేదని పిటిషనర్‌ను ప్రశ్నించింది. నిందితుడి వాదనలు వినకుండా ఉత్తర్వులు జారీ చేయలేమని చెప్పింది. దీనిపై శ్రవణ్ స్పందిస్తూ, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం నిందితుడి వాదనలు వినకుండా హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయవచ్చునని చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రతిని అందజేయాలని కోరిన హైకోర్టు విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది.

రాష్ట్ర కమిటీ నివేదిక అందాలి

బేడ, బుడగ జంగాల ఎస్సీహోదాపై హైకోర్టుకు తెలిపిన కేంద్రం

ప్రజాశక్తి, అమరావతి

బేడ, బుడగ జంగాలను ఎస్సీల జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రిటైర్డు ఐఎఎస్ అధికారి జేసీ శర్మ నేతత్వంలోని కమిటీ నివేదిక తమకు అందాల్సివుందని కేంద్రం హైకోర్టుకు తెలిపింది. ఆ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎన్.హరినాథ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ కమిటీ నివేదిక అందాక కేంద్రం చట్ట ప్రకారం తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ వివరాలను హైకోర్టు నమోదు చేసుకుంది. ఈ వివాదంపై వ్యాజ్యాలు విచారణలో ఉన్నాయని చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు డివిజన్ బెంచ్ సోమవారం ప్రకటించింది.

వైద్య కళాశాలల నిర్మాణానికి సహకరించండి: కేంద్ర మంత్రికి రజిని వినతి

న్యూఢిల్లీ బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కోరారు. సోమవారం నాడిక్కడ నిర్మాణ్ భవన్‌లో కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయను ఆమె కలిశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పలు విషయాలను చర్చించి, వినతి పత్రాలు అందజేశారు. పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయని, ఇప్పుడు ఈ మూడు చోట్ల కళాశాలల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి రజిని వివరించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న 17 మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలని, తగిన ఆర్థిక సాయాన్ని అందజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, వైద్య కళాశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారని చెప్పారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు పాల్గొన్నారు.

జియాంగ్ జెమిన్‌కు తుదివీడ్కోలు

- ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తామని ప్రతిన


బీజింగ్ : గత వారం కన్నుమూసిన చైనా మాజీ అధ్యక్షుడు, సిపిసి మాజీ ప్రధాన కార్యదర్శి జియాంగ్ జెమిన్‌కు అశ్రునయనాల నడుమ సోమవారం అంతిమ వీడ్కోలు పలికారు. పశ్చిమ బీజింగ్‌లోని బబావోషాన్ రివల్యూషనరీ సెమెట్రీలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు జరిగే స్థలికి జియాంగ్ భౌతికకాయాన్ని తీసుకుని రావడానికి ముందుగా పిఎల్ఎ జనరల్ ఆస్పత్రిలో కామ్రేడ్ జియాంగ్‌కు కడసారిగా జిన్‌పింగ్, ఇతర నేతలు నివాళు లర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో జెమిన్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు.జెమిన్ జీవితంలో ముఖ్యమైన ఘటనలు జరిగిన ప్రాంతాల్లో వందలాదిమంది అభిమానులు తమ ప్రియతమ నేతను గుర్తు చేసుకుంటూ పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఆయన సొంత వూర్లో ఇంటి వెలుపల, చదువుకున్న షాంఘై జియావో టాంగ్ యూనివర్శిటీ స్క్వేర్ వద్ద కూడా పలువురు పుష్పగుచ్ఛాలుంచి ఆయనను గుర్తు చేసుకున్నారు. జెమిన్ మాజీ సహచరులు సహా అశేష ప్రజానీకం ఆయన సేవలను కొనియాడుతూ జెమిన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతామని ప్రతిన బూనారు.



సిపిఎం సంతాపం

జియాంగ్ జెమిన్ మృతికి సిపిఎం సంతాపం తెలిపింది. సోమవారం న్యూఢిల్లీలోని చైనా దౌత్య కార్యాలయంలో జియాంగ్ జెమిన్ చిత్రపటం వద్ద సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. రుణ్ కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం తరపున సంతాప సందేశాన్ని చైనా ఎంబసీ అధికారులకు సీతారాం ఏచూరి అందజేశారు.

తాజ్‌మహల్ చరిత్ర ఎలా వుందో అలాగే కొనసాగనివ్వండి : సుప్రీంకోర్టు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో, : తాజ్ మహల్ నిర్మాణానికి సంబంధించి తప్పుగా చరిత్రలో నమోదైందని, వాటిని చరిత్ర పుస్తకాల నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. తాజ్‌మహల్ చరిత్ర ఎలా వుందో అలాగే కొనసాగనివ్వండి అని స్పష్టం చేసింది. గత రెండు మాసాల్లో ఈ తరహా పిటిషన్లు రెండు దాఖలయ్యాయి. అసలు ఇది ఏ తరహా పిల్ అని జస్టిస్ ఎంఆర్ షా, సిటి రవికుమార్‌లతో కూడిన బెంచ్ పిటిషనర్‌ని ప్రశ్నించింది. అక్టోబరులో ఇటువంటి పిటిషన్‌నే సుప్రీం కోర్టు తోసి పుచ్చింది. తాజ్ మహల్ వాస్తవ చరిత్రను అధ్యయనం చేసేందుకు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా ఆ పిటిషన్ కోరింది. ఇవి 'పబ్లిసిటీ ఇంటరెస్ట్ లిటిగేషన్'గా తయారయ్యాయని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది మేలో బిజెపి నేత రజనీష్ సింగ్ అలహాబాద్ హైకోర్టులో లక్నో బెంచ్ ముందు ఒక పిటిషన్ దాఖలు చేస్తూ, తాజ్‌మహల్ లో మూసివున్న 22 గదులను తెరిచేందుకు ఆదేశాలివ్వాలని కోరారు.

సుప్రీంలో వికలాంగుల సమస్యల పరిశీలనకు కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీం కోర్టులో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ కమిటీ ఏర్పాటు చేశారు. జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నేతృత్వం వహించే ఈ కమిటీలో ఆయనతోపాటు ఆరుగురు సభ్యులు ఉంటారు. "సుప్రీం కోర్టు కమిటీ ఆన్ యాక్సెసిబిలిటీ" అని పిలిచే కమిటీ సుప్రీం కోర్టు ప్రాంగణంలో సమగ్ర యాక్సెసిబిలిటీ ఆడిట్ నిర్వహించే బాధ్యతను నిర్వహిస్తుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68